# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6 /-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,గురువారం,
ఏప్రిల్ 16, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:267

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

గురువారం, తేది:16-04-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,చైత్ర మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,బహుళ పక్షం,చతుర్దశి,ఉత్తరాభాద్ర,వర్జ్యం,రా. 12-30ల 2.02


## ఢిల్లీకి సీఎం

హైదరాబాద్ (మెట్రోన్యూస్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు బయలుదేరి వెళ్లనున్నారు. బుధవారం సాయంత్రం ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల వాదనకు జాతీయ స్థాయిలో బలం కూడగట్టేందుకు ఆయన చర్యలు చేపట్టారు. అలాగే ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులను సీఎం రేవంత్ సమన్వయం చేస్తున్న విషయం విదితమే. ఈ అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రులందరికి ఆయన లేఖలు రాశారు.నినిహైబ్రిడ్ మోడల్ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారు.

# తాడో, పేడో

# పార్లమెంటులోనే తేల్చుకుంటాం

### కేంద్రం నిర్ణయంపై దక్షిణాది రాష్ట్రాల తిరుగుబాటు
### డీలిమిటేషన్‌తో నష్టపోతామంటున్న 4 రాష్ట్రాలు




హైదరాబాద్ (మెట్రో న్యూస్): మూడు కీలక బిల్లుల ఆమోదానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సిద్ధమవుతుంటే... నరేంద్ర మోదీ సర్కారుతో తాడోపేడో తేల్చుకోవడానికి దక్షిణాది రాష్ట్రాలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే పరిపరి విధాలా సౌత్‌ను వివక్షకు గురిచేస్తున్న మోదీ ప్రభుత్వం... సీట్ల పెంపు దురాలోచన చేస్తోందని తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో గురువారం నుంచి జరిగే పార్లమెంట్ ఉభయసభల ప్రత్యేక సమావేశాలు వాడివేడగా సాగే అవకాశాలున్నాయి. సీట్ల పెంపు బిల్లును అడ్డుకునేందుకు సభను స్థంభింపజేస్తామని విపలు ఇదివరకే సంకేతాలిచ్చాయి. పునర్విభజన పేరిట లోకసభలో సీట్ల పెంపు అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పెంపు ప్రతిపాదనల ఫార్ములాపై కేంద్రంతో ఢీ అంటే ఢీ అంటున్నారు. జనాభా దామాషా ప్రకారం సీట్లను పెంచుకుంటూ పోతే... కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణానికి ముమ్మాటికీ అన్యాయం జరుగుతుందని గట్టిగా వాదిస్తున్నారు. మనమంతా కలిసి కేంద్రం కుట్రను అడ్డుకోవాలని ఆయన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. కేంద్రంపై పోరాటానికి సిద్ధమని తమిళనాడు సీఎం స్టాలిన్ ముందుకొచ్చారు. మహిళకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ల బిల్లును ముందుకు పెట్టి... డీలిమిటేషన్, సీట్ల పెంపు బిల్లులనూ ఆమోదించుకునే కుట్రకు కేంద్రం తెరలేపిందని కాంగ్రెస్ అధిష్టానం ఆరోపిస్తోంది. పునర్విభజనతో సంబంధం లేకుండా ఈ ప్రత్యేక సమావేశాలలో మహిళా బిల్లు ఒక్కటే పాస్ చేసుకుందామని ప్రతిపలు సూచిస్తున్నాయి. కానీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. వస్తున్న వార్తలను బట్టి... దేశంలోని అన్ని రాష్ట్రాల లోకసభ సీట్లు 815, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్లు 35 వరకు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. తొలుత... 2026 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ ప్రక్రియ ఉంటుందని కేంద్రం ప్రకటించినా... ఇపుడు వ్యూహం మార్చి 2011 ప్రకారం ముందుకెళ్లాలని భావిస్తోంది. ఆ మేరకు బిల్లుకు సవరణలు చేయనుంది.

### డీలిమిటేషన్‌పై

# అపోహలొద్దు

### ఓబీసీ మోర్చా చైర్మన్ డా.కె.లక్ష్మణ్



ఢిల్లీ (మెట్రో న్యూస్): పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళలకు రాజకీయంగా పెద్దపీట వేస్తూ రాజ్యాంగ సవరణలు తీసుకురావడం నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న ఒక చారిత్రాత్మక నిర్ణయమని బిజెపి రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ అన్నారు. ఈ నిర్ణయం పట్ల దేశవ్యాప్తంగా మహిళలందరూ సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆదాయం ఆధారంగా నియోజక వర్గాల పునర్విభజన చేయాలన్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనను లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. డీలిమిటేషన్ అనేది ఎప్పుడైనా జనాభా లెక్కల ప్రకారమే జరుగుతదని, ఆదాయం ఆధారంగా చేయడం అనేది రాజ్యాంగానికే విరుద్ధమని,ఇలాంటి ఆలోచన చూసి దేశమంతా నవ్వుకుంటున్నదని ఎద్దేవా చేశారు.

## 20న సీఎం కాళేశ్వరం పర్యటన

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కాళేశ్వరంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీనిపరిశీలించనున్నారు. అనంతరం సరస్వతి నది అంత్య పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి శ్రీధరాబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## 22 వేల కోట్ల నష్టం




### టాటావైపు ఎయిర్ఇండియా చూపు..!

ఇంటర్నెట్ డెస్క్: దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాకు భారీ నష్టాలు వచ్చినట్లు తెలుస్తోంది. రూ.22వేల కోట్ల నష్టాలను మూటగట్టుకుందని సంబంధిత వర్గాలను పేర్కొంటూ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో వాటాదారుల నుంచి కంపెనీ ఆర్థిక సాయం కోరుతున్నట్లు పేర్కొన్నాయి. ఈ మేరకు టాటాగ్రూప్, సింగపూర్ ఎయిర్లైన్స్ లిమిటెడ్ను సంప్రదించినట్లు సమాచారం.మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరానికి ఈ నష్టాన్ని నివేదించినట్లు తెలుస్తోంది. నష్టం 1.6 బిలియన్ డాలర్లు ఉండొచ్చని వచ్చిన అంతర్గత అంచనాల కంటే ఈ మొత్తం భారీగా ఉండటం గమనార్హం. గతేడాది జూన్లో అహ్మదాబాద్లో విమాన ప్రమాదం, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ గగనతలం మూసివేత, ప్రస్తుత పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఈ కంపెనీని ఇబ్బందిపెట్టాయి. కార్యకలాపాలు సజావుగా సాగేందుకు వెంటనే అవసరమైన నిధుల కోసం టాటాగ్రూప్, సింగపూర్ ఎయిర్లైన్స్లో చర్చలు జరుపుతోందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు.


## పాకిస్తాన్‌కు అప్పులోళ్ల బాధ..

ఇంటర్నెట్ డెస్క్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు మిత్ర దేశాల నుంచి కూడా ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తమకు చెల్లించాల్సిన 3 బిలియన్ డాలర్ల రుణాన్ని పునరుద్ధరించేందుకు (రోలోవర్) నిరాకరించింది. గడువు ముగిసిన ఈ అప్పును వెంటనే తిరిగి చెల్లించాల్సిందేనని ఇటీవలే హెచ్చరించడం తెలిసిందే. అదేబాటలో పలు ఇతర దేశాలు కూడా పాక్‌ను అప్పులు చెల్లించాలని వెంటబడుతున్నాయి. ఈ పరిణామాలతో ఇస్లామాబాద్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అనేక సంవత్సరాలుగా గల్ఫ్ దేశాలు, చైనా వంటివి పాకిస్థాన్‌కు అండగా నిలుస్తున్నా, ఇప్పుడు వాటి సహనం నశిస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది.

## మాడ పగుల్తోంది



### హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక



హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది.

### భూసేకరణపై నిరసన..

# కవిత అరెస్ట్



వికారాబాద్(మెట్రోన్యూస్) : వికారాబాద్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు.
భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషనన్ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు.

# నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

### డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తాం- ఖర్గే



ఢిల్లీ (మెట్రో న్యూస్): కీలక బిల్లును ఆమోదింపజేసేందుకు మూడు రోజుల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు గురువారం ప్రారంభం కానున్నాయి. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, డీలిమిటేషన్ ఆధారంగా నియోజకవర్గాల పెంపు బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలలో ప్రవేశపెట్టనుంది. ఎన్డీయే కూటమి పార్టీలన్నీ తన సభ్యులకు విప్ జారీచేసింది. ఎలాగైనా బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మరోవైపు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఓకే చెబుతున్న ప్రధాన ప్రతిపక్షం, ఇతర విపలు నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపునకు ససేమిరా అంటున్నాయి. నినిఈ బిల్లులపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాలు గళమెత్తాయి. సీట్ల పెరుగుదల బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. పార్లమెంట్‌లో కేంద్ర వైఖరిపై పోరాడతామన్నారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే పునర్విభజన ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు. మహిళా బిల్లుకు మాత్రమే మద్దతిస్తామని లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పునర్విభజన పేరుతో, బీజేపీ తనకు అనుకూలంగా సీట్లను పెంచుకునే కుట్రకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. కులగణనను విస్మరిస్తూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అన్యాయం చేస్తోందన్నారు.

## డ్రగ్స్ కేసులో దుబాయ్ లింక్

హైదరాబాద్ (మెట్రోన్యూస్): మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, ఈ కేసులో కేదార్ అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మరణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.నినిరోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, కేదార్‌కు మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ముఖ్యంగా రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతా నుంచి కేదార్‌కు రూ.25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ ఆర్థిక లావాదేవీల గురించి రోహిత్ రెడ్డి, రితేష్‌ని ప్రశ్నించగా ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, వారు విచారణకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని విషయాలు రాబట్టడానికి కస్టడీని పొడిగించాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ నివేదికలో స్పష్టం చేశారు.

# వారసత్వ కట్టడాలకు అంతర్జాతీయ హంగులు

- దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యాటక అభివృద్ధి
- ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి చార్మినార్, చౌమొహల్లా ప్యాలస్‌ను సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, (మెట్రో న్యూస్):** చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావుతో కలిసి ఆయన చార్మినార్, చౌమొహల్లా ప్యాలస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా చార్మినార్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో కలియ తిరుగుతూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా మచిలీ కమాన్ పునరుద్ధరణ కోసం ఇప్పటికే కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ. 3.64 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే షేర్-ఇ-బాతీల్ కమాన్ రినోవేషన్ పనులను కూడా తక్షణమే చేపట్టాలని, చార్మినార్ వద్ద ఉన్న ఫౌంటైన్‌ను పర్యాటకులను ఆకర్షించేలా సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూపొందించిన నూతన పర్యాటక విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు జూపల్లి తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అటు ఆదాయం, ఇటు స్థానికులకు ఉపాధి పెరుగుతుందని చెప్పారు. నగర వారసత్వ సంపదపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని పర్యాటక పరంగా ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి జూపల్లి వివరించారు. దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించి, నగర వారసత్వ సంపదను కాపాడుతూనే ఆధునిక హంగులు అద్దుతామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు

## రోడ్డు ప్రమాదంలో ఖమ్మం కాంగ్రెస్ నేత జావెద్ మృతి



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారిపై పిల్లలమర్రి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఖమ్మం కాంగ్రెస్ నాయకుడు జావేద్ మృతి చెందారు. డివై డర్‌ను వేగంగా ఢీకొట్టి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా జావెద్ పార్టీ అభివృద్ధి కి కృషి చేసి పీసీసీ సభ్యుని స్థాయికి ఎదిగారు. జావెద్ మృతి పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రెవిన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఆయన వార్త తీవ్రంగా కలచి వేసిందని వారు పేర్కొన్నారు. ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న జావెద్ పార్టీ కోసం నిరంతరం అంకిత భావంతో పని చేశారని తెలిపారు ఆయన మరణం పార్టీకి తీరని లోటని వారు పేర్కొన్నారు.

## రూ. 2.54 లక్షల ఢిల్లీ మద్యం పట్టివేత



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** ఖరీదైన శివాజీ రీగల్ మద్యాన్ని ఢిల్లీలో తక్కువ ధరలకు కొనుగోలు చేసి సికింద్రాబాద్‌లో మొండా మార్కెట్ శివాజినగర్ చెప్పాల్వాది బజార్ ప్రాంతంలో అమ్మకాలు జరు పుతుండగా బుధవారం తెల్లవారు జామున సికింద్రాబాద్ ఎక్సైజ్ డీటీ ఎఫ్ టీమ్ సీఐ సౌజన్య టీమ్ కలిసి పట్టుకున్నారు. ఢిల్లీకి వివిధ సామాగ్రి తీసుక వెళ్లినపుడు తిరుగు ప్రయాణంలో శారద కుమార్ అనే వ్యక్తి ఢిల్లీలో శివాజీ రీగల్‌ను రూ.1500 లకు కొనుగోలు చేసి హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో రూ.3000 వేల నుంచి రూ.3500 అమ్మకాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య, ఎస్సై శివ కుమార్, కానిస్టేబుళ్లు జనార్ధన్, రిజ్వాన్, సిద్దిక్‌లు అశోక్ లీలాండ్‌లో ఢిల్లీ నుంచి వచ్చి వాహనంలోని మద్యం బాటిల్ లను అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు. వాహనంలో తనిఖీలు నిర్వహించగా 52 శివాజీ రీగల్‌మద్యంబాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకు న్నారు. ఈ మద్యం బాటిళ్ల విలువ రూ.2.54 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. పట్టుకున్న మద్యం బాటిళ్లను, నింది తుడిని, వాహనాన్ని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ సౌజన్య తెలిపారు.

## విదేశీ పర్యాటకునితో మంత్రి జూపల్లి ముచ్చట

### - హైదరాబాద్ ఆతిథ్యంపై ఆరా.. చౌమొహల్లా ప్యాలెస్‌లో ఆసక్తికర సన్నివేశం

**హైదరాబాద్, (మెట్రో న్యూస్ ) :** చారిత్రక చౌమొహల్లా ప్యాలెస్‌లో బుధవారం ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్యాలెస్ సందర్శనకు వచ్చిన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు బ్రిటన్ నుంచి వచ్చిన ఓ పర్యాటకుడు ఎదురయ్యాడు . దీంతో మంత్రి సదరు విదేశీయుడితో ముచ్చటించారు. హైదరాబాద్ పర్యటన ఎలా సాగుతోందని మంత్రి ఆయనను అడిగి తెలుసుకున్నారు. నగరంలో ఇంకా ఏయే ప్రదేశాలు చూశారని వాకబు చేయగా.. ఇప్పటికే తాము కుతుబ్‌షాహీ సమాధులను దర్శించుకున్నట్లు ఆ పర్యాటకుడు బదులిచ్చారు. భాగ్యనగర ఆతిథ్యం ఎలా ఉంది? ఇక్కడి రుచికరమైన వంటకాలు నచ్చాయా? అని మంత్రి వాకబు చేశారు. పర్యాటకుల నుంచి లభించే సలహాలు, సూచనల ఆధారంగా రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల వద్ద సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని



అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది, విదేశీ పర్యాటకులకు గమ్యస్థానంగా మారుస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

## విభజన రాజకీయాలకు చెక్ పెట్టాలి తమిళనాట మంత్రి ఉత్తమ్ ప్రచారహోరు

**శివకాశి (మెట్రో న్యూస్):** లౌకికవాదానికి తమిళనాడు పెట్టని కోట అని తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి లౌకికవాదం కొనసాగాలి అంటే ఈ ఎన్నికలలో డి.యం.కే-కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బలపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన ఉద్బోధించారు. తమిళనాడు ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన మంత్రి గడిచిన మూడు రోజులుగా తమిళనాడు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. విభజన రాజకీయాలకు చెక్ పెట్టాలని ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా బుధవారం రోజున కోయంబత్తూరు సమీపంలోని సింగనల్లూర్ నుండి కవుండంపాలెం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి ఉత్తమ్... శివకాశికి చేరుకుని అక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమిళనాడులో విభజన రాజకీయాలకు చోటు లేదని స్పష్టం చేశారు. బి.జె.పి కి ఇక్కడ ప్రవేశం కుడా ఉండొద్దని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ



ఆధ్వర్యంలో 21 పార్టీలతో ఏర్పడిన సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ఢిల్లీ నుండి గ్రామీణ స్థాయి వరకు విజయవంతంగా కొనసాగుతుందన్నారు. భవిష్యత్ ప్రధాని రాహుల్ గాంధీ నాయకత్వం కోసం దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారని ప్రజల ఆకాంక్ష ప్రతిబింపచేసేలా ఏకం కావాలన్నారు.

## 1.050 కేజీల గంజాయి పట్టి వేత.. ముగ్గురి అరెస్టు

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుబాష్ చందర్ సిబ్బంది తొ కలిసి షెర్‌లింగంపల్లి రెండు చోట్ల 1.050 కేజీల గంజాయిని పట్టుకున్నారు. షేర్ లింగంపల్లి ఆర్ ఎస్ బ్రదర్స్ షాపు ప్రాంతంలో ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన వంగ మనోజ్ రవి తేజ అనే వ్యక్తి వద్ద 300 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఇదే ప్రాంతంలోని విజయ డైగ్నోస్టిక్ సెంటర్ ప్రాంతంలో 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన బొట్ల భాస్కర సాయి, రెల్ల బాను ప్రకాష్‌లను అరెస్టు చేశారు. పట్టుకున్న గంజాయిని, ముగ్గురు నిందితులను, టూవీలర్‌ను, సెల్ ఫోన్లను షేర్ లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా కె. నరసింహ బాధ్యతలు స్వీకారం



**మెట్రో న్యూస్, మలక్‌పేట్:** మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సీఐ)గా కె. నరసింహ బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ కె. నరసింహ మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ చట్టవ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేస్తానని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలను అరికట్టడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, శాంతి భద్రతలను పరిరక్షించడం తన ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహ రిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుం టామని స్పష్టం చేశారు. అలాగే, మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని అన్నారు.

## సీతక్కను విమర్శించడం దారుణం : బండ్రు శోభారాణి



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** బీఆర్ఎస్ నాయకురాలు సత్యవతి రాథోడ్ మంత్రి సీతక్కను విమర్శించడం దారుణమని కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభరాణి అన్నారు. బుధవారం ఆమె గాంధీ భవన్లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నేత్రుత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం ఏం చేసినా ప్రతి పక్షాలు బురద జల్లుతున్నాయన్నారు అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు ఇవ్వాలనేది కేంద్ర నిర్ణయమని చెప్పారు. రూపాయలు 11 800లకు సెల్ ఫోన్లు కొనాలని కేంద్రం చెపితే వాటిని 11650 రూపాయలకే కొన్నట్టు ఆమె వివరించారు. కేంద్రం చెప్పిన దాని కంటే తక్కువకి కొనడం మంత్రి సీతక్క చేసిన తప్పా అని ఆమె ప్రశ్నించారు. ఆదివాసీలు, లంబాడీలు నిజాయితీగా ఉంటారని సత్యవతి రాథోడ్ మాత్రం భిన్నంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. సత్యవతి రాథోడ్ బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళాక కరెప్టెడ్ అయ్యారన్నారు సత్యవతిరాథోడ్ మంత్రిగాఉన్నప్పటి విషయాలపై చర్చకి సిద్దమా అని అన్నారు పని గట్టుకొని సీతక్కపై అసత్య ప్రచారం చేస్తున్నారని బీఆర్ ఎస్ సోషల్ మీడియాద్వారా మనుషుల వ్యక్తిత్వ హననం చేస్తున్నారని ఆరోపించారు..నక్సలైట్‌గా ఉన్నప్పటి నుండి ఇప్పటిదాకా సీతక్క నిజాయితీగా ఉన్నారని ఆమెతో కలిసి అండర్ గ్రౌండ్‌లో పనిచేశామని శోభరాణి పేర్కొన్నారు.

## మెడికల్ కళాశాలల సమస్యలపై చలో వరంగల్ : మెడికో పేరెంట్స్ అసోసియేషన్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** తెలంగాణ మెడికల్ కాలేజీలలో సమస్యలపై మెడికో పేరెంట్స్ అసోసియేషన్ చలో వరంగల్ కు పిలుపునిచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వరంగల్ లోని కాళోజి నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ ముట్టడి కార్యక్రమంలో యావత్ తెలంగాణ మెడికల్ కళాశాలల పేరెంట్స్ పాల్గొనాలని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజి సత్యనారాయణ చారి ఈరోజు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా ప్రైవేట్ మెడికల్ కళాశాలలో బి మరియు సి కేటగిరీలలో అధిక ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం 4.5 ఏళ్లకే ఫీజులు వసూలు చేయాల్సి ఉండగా 5 ఏళ్లకు వసూలు చేస్తున్నారు. అంటే ఒక సీ క్యాటగిరిలో జాయిన్ అయిన విద్యార్థి నుండి 12 లక్షలు బి కేటగిరీలో జాయిన్ అయిన విద్యార్థులు నుండి ఆరు లక్షలు అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఈ అదనంగా 209 కోట్లు వసూలు చేస్తున్న ప్రైవేట్ మెడికల్ కళాశాలల వైఖరికి నిరసనగా మెడికల్ పేరెంట్స్ అసోసియేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ప్రైవేట్ కళాశాల జరుగుతున్న ఈ దోపిడీ గురించి గత వారం తెలంగాణ ఫీ రెగ్యులేటరీ చైర్మన్‌కు సైతం ఫిర్యాదు చేయడం జరిగింది.

ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఏ కేటగిరీలో జాయిన్ అయిన విద్యార్థులకు సైతం ప్రభుత్వ నిబంధన ప్రకారం 60000 యూనివర్సిటీ ఫీజు తీసుకోవాలని మేనేజ్మెంట్ అదనంగా ఒక్కొక్క కళాశాలలో 1,50,000 1,20,000 ఇలా ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వసూలు చేస్తున్నారు దీనికి నిరసనగా మెడికో పేరెంట్స్ అసోసియేషన్ చలో వరంగల్ పిలుపునిచ్చారు. వరంగల్ కేఎన్ఆర్ యూహెచ్ఎస్ వద్దకు 17వ తారీకు శుక్రవారం 10 గంటలకు మెడికల్ పేరెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.

## సీఎం రేవంత్ రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** దేశంలో నియోజకవర్గాల పునర్విభజన మరియు మహిళా రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, అపోహలు సృష్టిస్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీయే ఇచ్చిందని రేవంత్ రెడ్డి చెప్పడం బీఆర్ అంబేద్కర్‌ను ఘోరంగా అవమానించడమేనని ధ్వజమెత్తారు. రాజ్యాంగ పీఠికలోనే 'ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకుంటున్నాం' అని స్పష్టంగా ఉందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం తమ పార్టీయే ఇచ్చిందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డీలిమిటేషన్ అనేది ఆర్టికల్ 82 మరియు 170 ప్రకారం ప్రతి పది ఏళ్లకు జరిగే సెన్సస్ ఆధారంగా చేపట్టే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, దీనిపై ముఖ్యమంత్రికి కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా, భారత రాష్ట్రపతి ఎలక్షన్



కమిషన్‌తో సంప్రదించి డీలిమిటేషన్ కమిషన్‌ను నియమిస్తారని, ఆ కమిషన్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వంటి సభ్యులు ఉంటారని ఆయన వివరించారు. మరోవైపు రాష్ట్రంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి దేశ రాజకీయాల గురించి లెటర్లు రాయడం రేవంత్ రెడ్డి ఫెయిల్యూర్ పాలిటిక్స్‌కు నిదర్శనమన్నారు.

## కాంగ్రెస్‌ను కాల్చి బూడిద చేయాలి

### - పరిగి రైతులకు కవిత సంఘీభావం




**వికారాబాద్ (మెట్రో న్యూస్):** పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను నిర్బంధంగా తీసుకోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు బుధవారం ఆందోళన నిర్వహించాయి. రైతుల కోసం వికారాబాద్ ఆర్డీవో ఆఫీస్ ఎదురుగా మండుటెండలో బైఠాయించి కల్వకుంట్ల కవిత, విశారదన్ మహరాజ్, రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు, కవితకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పరిశ్రమల పేరుతో చిన్న, సన్నకారుల రైతుల భూములు లాక్కుంటున్నారని జాగృతి అధ్యక్షురాలు మండపడ్డారు. కాంగ్రెస్ పార్టీని కాల్చిన బూడిద చేసిన సరే ఈ పాపం పోదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెనం మీద ఉంటే ఇప్పుడు పొయ్యిలో పడినట్టుగా రైతుల పరిస్థితి ఉందని కవిత ధ్వజమెత్తారు. ఎక్కడ రైతులకు అన్యాయం జరిగితే అక్కడ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ పోరాడుతుందన్నారు. బలవంతపు భూసేకరణను నిలిపివేసే వరకు ఉద్యమిస్తాం అని హెచ్చరించారు. పరిశ్రమల కోసం పరిగిలో రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారు. కల్లాపూర్, రాపోల్, భట్ల చందారం సహా పలు గ్రామాల్లో రైతుల భూములను గుంజుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో మొత్తం భూమిని తీసుకుంటున్నారు. ఆ రైతులకు మరో దిక్కు లేని పరిస్థితి తెచ్చారు. ఇక్కడ రైతుల బాధ రాష్ట్రం మొత్తానికి తెలియాలనే వికారాబాద్‌లో ఆందోళన చేపట్టాం అన్నారు.

మెట్రో
హైదరాబాద్,
గురువారం,
ఏప్రిల్ 16, 2026



# డీ లిమిటేషన్‌పై రాజకీయ రచ్చ

## అగ్రనేతల సుదీర్ఘ చర్చ



ఫైల్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో రాజకీయ పరిణామాలు, పార్టీ నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సీఎం నివాసంలో బుధవారం జరిగిన ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. జగిత్యాలకు చెందిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేయడం, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం, చైర్మన్ పదవీకాలం ముగిసిన వారి విషయంలో రెన్యూవల్ చేయడం లేదా కొత్త వారిని నియమించే దానిపై ముగ్గురు నేతలు సుదీర్ఘంగా చర్చించారని తెలుస్తోంది. వాస్తవానికి బడ్జెట్ సమావేశాల్లోపు నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీచేస్తామని పీసీసీ చీఫ్ ప్రకటించారు. కానీ అది జరగకపోవంతో... చైర్మన్ పదవులు ఆశిస్తున్నవారిలో నైరాశ్యం నెలకొంది. మరోవైపు కొందరు చైర్మన్ల పదవీకాలం ముగిసినా.. పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేదు. వారిని కొనసాగించడమా.. కొత్తవారికి అవకాశాలు ఇవ్వడమా అనేది తేల్చడం లేదు. ఇదిలా ఉంటే.. రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్తున్నారు. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల వాదనకు జాతీయ స్థాయిలో బలం కూడగట్టే ప్రయత్నంలో మంగళవారం లేఖ కూడా రాశారు. అన్యాయం చేయవద్దని ప్రధానిని విజ్ఞప్తి చేస్తూనే... ఐక్యంగా పోరాడాలని దక్షిణాది రాష్ట్రాలకు సీఎం పిలుపునిచ్చారు. గురువారం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని సమాచారం.

## రెండేళ్ల చిన్నారిని హతమార్చిన తండ్రి

హైదరాబాద్ (మెట్రోన్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హనుమాపురంలో దారుణ సంఘటన జరిగింది. రెండేళ్ల వయస్సు ఉన్న కూతురిని కన్న తండ్రే గొంతు నులిమి హతమార్చాడు. గ్రామానికి చెందిన శ్రీరాములు, తన భార్యకు మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. గడిచిన ఉగాది పండుగకు భార్య తన తల్లిగారింటికి వెళ్లి వచ్చిన తర్వాత ఈ గొడవలు ఎక్కువయ్యాయి.

# హర్మూజ్ దిగ్బంధనానికి

# 10 వేల మంది సిబ్బంది



ఇంటర్నెట్ డెస్క్: హర్మూజ్ జలసంధితో సహా ఇరాన్‌లోని కీలక ఓడరేవులపై పూర్తి దిగ్బంధనాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మూజ్ జలసంధిపై దిగ్బంధనానికి ఇరాన్ పోర్టుల్లో దాదాపు 10 వేల మంది సైనికులు, మెరైనర్లు, వైమానిక దళ సిబ్బందిని అమెరికా మోహరించింది. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యం పైనే ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఆధారపడి ఉంటుందని, కానీ దిగ్బంధనం ప్రారంభించిన 36 గంటల్లోనే ఇరాన్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను అమెరికా దళాలు పూర్తిగా నిలిపివేశాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తెలిపారు. అమెరికా నావికాదళ పర్యవేక్షణలో క్షిపణులు సిద్ధంగా ఉన్నాయని, అవి ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే నౌకలను, లోపలకు వెళ్లే వాటిని లక్ష్యంగా చేసుకుంటాయని 'ఎక్స్' వేదికగా అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇదిలా ఉండగా, గల్ఫ్ దేశాల నుంచి బయల్దేరి హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ప్రయత్నించిన రిచ్ స్టార్రీ అనే నౌక అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా వెనుదిరిగింది.



## అండమాన్ సముద్రంలో పడవ మునిగి

# 250 మంది గల్లంతు

ఇంటర్నెట్ డెస్క్: రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ అండమాన్ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో చిన్నారులు సహా దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించి ఐక్యరాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుండి బయలుదేరి మలేషియాకు వెళ్తున్న ట్రాలర్, బలమైన గాలులు, కెరటాల ఉద్ధృతి, పరిమితికి మించిన జనంతో ప్రయాణించడం వంటి కారణాలతో మునిగిపోయినట్లు తెలుస్తోందిః అని ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పడవ ఏప్రిల్ 4వ తేదీన బంగ్లాదేశ్ నుంచి బయలుదేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేషియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఐక్యరాజ్య సమితి అధికారులు తెలిపారు. ఈ రోహింగ్యాలు వాస్తవానికి మయన్మార్‌కు చెందినవారు. కానీ 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు.

## కదిరిలో పేలిన గ్యాస్ సిలిండర్లు

# 4గురు మృతి

కదిరి, (మెట్రోన్యూస్) : సత్యసాయి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# ఫలితాల్లో బాలికల జోరు

**మొదటి సంవత్సరం: 90 ఉత్తీర్ణత**
**రెండవ సంవత్సరం: 92 ఉత్తీర్ణత**

ఏపి: ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల.. 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పాస్ పర్సంటేజ్ నమోదు
1. కృష్ణా జిల్లా (మొదటి స్థానం)
కృష్ణా జిల్లా విద్యార్థులు రికార్డు స్థాయి మార్కులతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు.
2. గుంటూరు జిల్లా (రెండో స్థానం)
మెరుగైన విద్యా ప్రమాణాలతో గుంటూరు జిల్లా 88 ఉత్తీర్ణతతో రెండో స్థానంలో నిలిచింది. ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం..

### భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి మృతి

ఢిల్లీ (మెట్రోన్యూస్): ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. బుద్ధవిహార్ పరిధిలో స్లమ్ ఏరియాలో మంటలు చెలరేగడంతో గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతి అవ్వడం స్థానికంగా అందర్నీ కలిచివేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధవిహార్ పరిధిలోని స్లమ్ ఏరియాలో సుమారు 400 చదరపు గజాల ప్లాస్టిక్ స్క్రాప్‌ను నిల్వ ఉంచారు. దాని చుట్టే పలు గుడిసెలను నిర్మించుకున్నారు. అయితే బుధవారం తెల్లవారుజామున 1.25 గంటల ప్రాంతంలో స్క్రాప్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన గుడిసెల్లోని కుటుంబాలు మంటలు అప్రమత్తమయ్యేలోపే మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

## అన్యాయం చేస్తే

# ఉద్యమిస్తాం

### పునర్విభజనపై కేంద్రానికి కేటీఆర్ హెచ్చరిక



హైదరాబాద్ (మెట్రో న్యూస్): నియోజకవర్గాల పునర్విభజన అంశంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డిలిమిటేషన్ జరిగితే, అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని, మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన స్టాండ్‌కే కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభానియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

## బిహార్‌లో ముగిసిన నితీష్ యుగం..

పాట్నా, (మెట్రో న్యూస్): బిహార్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన నితీష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, భారతీయ జనతా పార్టీ కి చెందిన బలమైన నేత సమ్రాట్ చౌదరి బిహార్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.




## అమెరికా-ఇరాన్ టెన్షన్ కూల్.. మార్కెట్లలో భారీ జోష్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా, ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడటంతో సూచీలు పరుగులు పెట్టాయి. ఉదయం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1303 పాయింట్లు (1.70 ) పెరిగి 78,150.54 వద్దకు చేరగా, నిఫ్టీ 392 పాయింట్లు (1.61 ) లాభపడి 24,237.70 వద్ద ట్రేడ్ అయింది. ఇరాన్‌తో వివాదం ముగింపు దశకు రావొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించడంతో ప్రపంచ మార్కెట్లలో స్థిరత్వం వస్తుందన్న ఆశలు పెరిగాయి. ఈ సానుకూల పరిణామం భారత మార్కెట్లకు మంచి ఊపునిచ్చింది.

## టాలీవుడ్‌లో సమ్మె సైరన్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల (థియేటర్ యజమానులు) మధ్య నెలకొన్న వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఆదాయంలో వాటా (రెవెన్యూ షేరింగ్) విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మే 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సమ్మర్ సీజన్‌లో విడుదల కావాల్సిన పలు క్రేజీ సినిమాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఉన్న రెంటల్ పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, ఓటీటీల ప్రభావంతో ప్రేక్షకుల సంఖ్య తగ్గడంతో థియేటర్లు నడపడం కష్టంగా మారిందని వారు చెబుతున్నారు.

## హెల్త్‌కేర్ కంపెనీలకు క్యూ4లో మిశ్రమ ఫలితాలు.. ఆదాయం పెరిగినా లాభాల డౌన్!

ఢిల్లీ (మెట్రోన్యూస్): భారత ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగంలోని కంపెనీలకు గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం మిశ్రమ ఫలితాలను అందించనుంది. ఈ త్రైమాసికంలో కంపెనీల ఆదాయంలో అధిక సింగిల్-డిజిట్ వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటి లాభదాయకత, నికర ఆదాయం గణనీయంగా క్షీణించవచ్చని ప్రముఖ అనలిటిక్స్ సంస్థ సిస్టమాటిక్స్ తన నివేదికలో వెల్లడించింది. నివేదిక అంచనాల ప్రకారం, ఫార్మా కంపెనీల ఆదాయంలో సగటున 12 శాతం వృద్ధి కనిపించినా, ఎబిటా లో కేవలం 3.6 శాతం పెరుగుదల మాత్రమే ఉంటుంది. ఇక నికర లాభాల్లో ఏకంగా 14 శాతం క్షీణత నమోదయ్యే అవకాశం ఉంది. ఇందుకు ప్రధాన కారణం క్యాన్సర్ చికిత్సలో వాడే 'జెనరిక్ రెవ్లిమిడ్ అనే ఔషధంపై పలు భారతీయ కంపెనీలు ప్రత్యేక హక్కులను కోల్పోవడమే. దీని ప్రభావం ముఖ్యంగా డాక్టర్ రెడ్డీస్, జైడస్, సిప్లా, సన్ ఫార్మా వంటి దిగ్గజ సంస్థలపై స్పష్టంగా కనిపించనుంది. ఇదే సమయంలో, లాన్రియోటైడ్ అనే మరో ఔషధం సరఫరాలో అంతరాయాల కారణంగా సిప్లా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవచ్చని నివేదిక పేర్కొంది. అలాగే, మిరాబెగ్రాన్ సంబంధిత రాయల్టీ చెల్లింపుల వల్ల లూపిన్, జైడస్ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పెరగవచ్చని అంచనా వేసింది. అన్నింటికంటే ముఖ్యంగా, డాక్టర్ రెడ్డీస్ ఆదాయంలో జెనరిక్ రెవ్లిమిడ్ వాటా అధికంగా ఉన్నందున, ఆ సంస్థ లాభాల్లో అత్యంత భారీ క్షీణత నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది.



కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవెనింగ్


4, హైదరాబాద్ గురువారం ఏప్రిల్ 16, 2026

# పేదరికం కోరల్లోకి ప్రపంచం..

//ఎడిటోరియల్//

యుద్ధం ఎపుడూ అశాంతిని అరాచకాన్ని అపసవ్య సమాజాన్ని అందిస్తుంది. యుద్ధం తరువాత వెనక్కి చూస్తే మృతులు ఎంత మందో జీవన్మృతులు అంతకు మించి ఉంటారు. మృతులే అదృష్టవంతులు అనిపించే పరిస్థితి కూడా ఉంటుంది. ఇదంతా ఎందుకు అంటే పశ్చిమాసియాలో చోటు చేసిన సంక్షోభం ప్రపంచానికి అందిస్తున్న అతి పెద్ద చేదు ఫలితం. అదే పేదరికం. ఈ రోజున ప్రపంచంలోకి అనేక దేశాలు ఆర్థికంగా వెనకబడి ఉన్నాయి. అయిదారేళ్ళ క్రితం మొత్తం భూగోళాన్ని ఉయ్యాల పట్టి ఊపేసిన కరోనా వంటి విపత్తు ధాటికి గురి అయి ఇంకా తేరుకోని దేశాలు ఉన్నాయి. ఇక భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల మీదనే యుద్ధ ప్రభావం పడుతూంటే పేద దేశాల సంగతి చెప్పనవసరం లేదు. లక్షల్లో పేదలు : ఈ యుద్ధం లక్షల్లో పేదలను కొత్తగా తయారు చేసింది అని ఐక్య రాజ్య సమితి తన తాజా నివేదికలో వెల్లడించింది. అంతే కాదు ఎటు చూసినా చేటు కాలం కరవు కాలం దాపురిస్తోందని కూడా హెచ్చరించింది ఆహార కొరతతో అల్లాడిపోతూ అంతర్జాతీయ సమాజం నలిగి పోతుందని కూడా ఈ నివేదిక హెచ్చరిస్తోంది. ఇప్పటికి దాదాపుగా నెలన్నరకు పైగా సాగుతున్న పశ్చిమాసియా యుద్ధం మీద అందించిన ఈ నివేదికలో ఎన్నో కఠిన సత్యాలు ఉన్నాయని అంటున్నారు. మండుతున్న ధరలతో : ఇప్పటికీ కొనసాగుతున్న యుద్ధం ముడి చమురు ధరలు పెరిగిపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు అనేక దేశాలలో పెద్ద ఎత్తున పెరిగిపోతున్నాయని నివేదిక పేర్కొంది. సామాన్య దేశాలే కాదు భారత్ మీద కూడా పశ్చిమాసియా యుద్ధ ప్రభావం అధికంగా పడబోతోంది అని అంటున్నారు. ఈ యుద్ధం కారణంగా భారత్ లోనే పాతిక లక్షల మంది కొత్త పేదలు తయారు అయ్యారని నివేదిక చెబుతోంది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తలు ఆసియా ఫసిఫిక్ లో మానవ అభివృద్ధి పైన ప్రభావాలు అన్న పేరుతో యూ ఎస్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఒక నివేదికను తాజాగా రూపొందించింది. ఆహార భద్రతకు ముప్పు : ఈ నివేదిక ప్రకారం చూస్తే కనుక ఈ యుద్ధం మూలంగా ఆసియా ఫసిఫిక్ అంతటా తీవ్రమైన ప్రభావం చూపిస్తోంది అని అంటున్నారు. అభివృద్ధికి బ్రేకులు పడడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 88 లక్షల మద్ని ప్రజలు పేదరికంలో కూరుకుని పోయే ప్ర్మాదం ఉందని అంచనా వేసింది. ఇక చైనాలోనూ ఈ యుద్ధం ప్రభావం ఎక్కువగానే ఉండొచ్చు అని నివేదిక పేర్కొంది. పెరిగిన ఇంధనం ధరలతో రవాణా, ముడి సరుకుల ధరలు పెరగడం, అలాగే కుటుంబాల కొనుగోలు శక్తిని పూర్తిగా తగ్గించేలా పర్యవసానాలు ఉన్నాయని వెల్లడించింది. ఆహార భద్రత మీద తీవ్ర ఒత్తిడి పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రభుత్వాల బడ్జెట్లు సైతం ప్రభావం అవుతాయని అంటోంది. ఈ దేశాలన్నీ ఇబ్బందుల్లో : భారత్ పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, పిలిప్పీన్స్ తో సహా అనేక దేశాలలోని ఆహార భద్రత ఒత్తిళ్ళు తీవ్రమవుతాయని ఈ నివేదిక పేర్కొంది. ఇప్పటికే ఇలా ఉంటే ఈ యుద్ధం ఇంకా ఎక్కువ కాలం కొనసాగితే భారత్ వంటి దేశాలలో యూరియా నిల్వలు తగ్గిపోతాయని అది రైతుల మీద తీవ్ర ప్రభావం చూపిస్తుందని వెల్లడించింది. అంతే కాదు హోర్మూజ్ జలసంధి పరిసరాలలో నెలకొన్న ఉద్రిక్తత కారణంగా భారత్ లో వైద్య పరికరాలకు సంబంధించిన ముడి పదార్థాలకు కూడా ఇబ్బంది అవుతుందని స్పష్టం చేస్తోంది. దాంతో ఈ ధరలు ఏకంగా యాభై శాతం పైగా పెరగవచ్చునని చెప్పుకొచ్చింది. ఔషధాల టోకు ధరలు ఇప్పటికే పది నుంచి పదిహేను శాతం పెరిగాయని వెల్లడించింది. మొత్తం మీద యుద్ధం ప్రభావం అధికంగా ఉంటుందని ప్రపంచం అంతా పేదరికం కోరల్లోకి వెళ్ళడం ఖాయమని చెబుతున్న ఈ నివేదిక చూస్తే కలవరం కలుగుతోంది.


## అగ్గిపుల్ల



ఒక చెట్టు మిలియన్ల కొద్దీ..
అగ్గిపుల్లలను అందిస్తుంది
కేవలం ఒక అగ్గిపుల్ల మాత్రం..
మిలియన్ల చెట్లను కాల్చేస్తుంది !
ఒక్క చిన్న నెగెటివ్ ఆలోచన..
నీ మదిలో పదిలపర్చుకున్న..
వేలాది పాజిటివ్ ఆలోచనల్ని..
కాల్చి భస్మం చేసేస్తుంది కదా నేస్తం !
అగ్గిపుల్ల ఓ నిశ్శబ్ద శక్తి
వంటింటి వంటకు పునాది
కొలిమి మంట జనన నిధి
కార్చిచ్చు విధ్వంసానికి కారణం !
ఒక్క అగ్గిపుల్ల గీకేసి..
ఇళ్లు కాల్చి బూడిద చేయవచ్చు
అగ్గిపుల్ల జ్వాల పునాదిగా..
మిలియన్ల కుటుంబాలు బతకవచ్చు !
చెత్తను, బీడీలను కాల్చవచ్చు
కొవ్వత్తి వెలిగించి చీకట్లను తరుమ వచ్చు
కొంపల్ని కూల్చేయవచ్చు
సంపదల్ని పోగు చేయవచ్చు !
ఒక్క అగ్గిపుల్లతో పొయ్యి రాజేయవచ్చు
క్షణాల్లో ఊరంతా భస్మం చేయవచ్చు
నరుడి చేతులో అదో అణ్వాయుధం
అభివృద్ధికి అదో మూల అగ్ని స్తంభం !
ప్రతి వ్యక్తి ఓ అగ్గిపుల్ల మాత్రమే
అభివృద్ధి పథంలో నడవవచ్చు
వినాశనానికి హేతువు కావచ్చు
వాడుకున్నోడికి వాడుకున్నంత !

-మధుపాళీ, 9949700037

# కళలతో సానుకూల సమాజ నిర్మాణం







## మెట్రో తెలంగాణ చావడి



కళ అనేది ఒక విశ్వ భాష. కళ ద్వారా సరిహద్దులు చెరపబడుతున్నాయి. ప్రపంచ ప్రజలు సంస్కృతుల ఫలితంగా ఏకతాటిపైకి వస్తున్నారు. మన భావోద్వేగాలు, ఆలోచనలు, ఉపాయాలు, జీవన విధానాలు, సంప్రదాయాలు వ్యక్తం చేయబడుతున్నాయి. సమాజ చైతన్య వేదికలుగా కళలు అపార ప్రయోజనాలను అందిస్తున్నాయి. కళలకు ఉన్న అపార అదృశ్య శక్తి ప్రజలను ఏకం చేయడానికి, సమాజంలో నెలకొన్న అనారోగ్యకర ఆచారాల చికిత్సకు, సమైక్యంగా సాగిపోవడానికి ఉపయోగపడు తున్నాయని ఇటీవల జరిగిన సంక్షోభాలు, కరోనా విపత్తులు, మానవ వేదనల సమయాలు రుజువు చేస్తున్నాయి. కళా విద్యతో అభిజ్ఞా నైపుణ్యాల్లో వృద్ధి, దృశ్య మాధ్యమ జ్ఞానం పెరగడం, ఆత్మ గౌరవంతో పాటు ఆత్మ విశ్వాసం ఊపందుకోవడం జరుగుతున్నది. మానసిక ఆందోళనలు, ఒత్తిడి లాంటి అనారోగ్యాలకు చికిత్సలు, సృజన/ఆవిష్కరణల ప్రవృత్తిని మేలుకొలవడం లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి. నిని ప్రపంచ కళా దినోత్సవం-2026 ఇతివృత్తం:ని కళాకారుల సృజన ద్వారా పౌర సమాజం జాగృత పడడం, వైవిధ్యభరిత కళా ప్రదర్శనలు కొనసాగడం, మానవ సుస్థిరాభివృద్ధిలో కళలు భాగస్వామ్యం తీసుకోవడం గమనించిన యునెస్కో 2019లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 15 ఏప్రిల్‌న "ప్రపంచ కళా దినోత్సవం" లేదా "వరల్డ్ ఆర్ట్ డే" నిర్వహించడం జరుగుతోంది. 2026 ప్రపంచ కళా దినోత్సవ ఇతివృత్తంగా "భావ వ్యక్తీకరణ తోట : కళల ద్వారా సమాజాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. కళా సృజనతో ప్రపంచ మానవాళి ఒకే వేదికపైకి రావడం, విజ్ఞాన వితరణ జరగడం, ఉత్సుకత పెరగడం, విభేదాల పరిష్కారాల దిశగా చర్చలు కోనసాగడం జరుగుతున్నది. కళా ప్రదర్శనలను పోత్సహించడం, కళాకారులకు స్వేచ్ఛను ఇస్తూ అక్కున చేర్చుకోవడం కొనసాగాలి. కళా వేదికల వెలుగుల ద్వారా పౌర సమాజ అభివృద్ధి సుసాధ్యం అవుతున్నదని తెలుసుకోవాలి. ఆర్కిటెక్చర్, సంగీతం, పేయింటింగ్, శిల్పాలు చెక్కడం, నాట్యం, సినిమా, నాటక వేదికలు, సాహిత్యం లాంటి కళలు మానవ నిత్య జీవితంగా ఓ ప్రధాన భాగం అయ్యాయి. ఇలాంటి శక్తివంతమైన కళారూపాలతో పౌరసమాజ చైతన్యం జరుగుతోంది. ప్రపంచ కళా దినోత్సవ వేదికగా కళా ప్రదర్శనలు, కార్యశాలలు, కళా బోధనలు, కళా శిక్షణలు, కళాకారులను ప్రోత్సహించడం, కళా ప్రదర్శనలకు సౌజన్య ప్రదాతలుగా నిలవడం, కళను సానబట్టడం జరగాలి. కళల మాధ్యమంగా పిల్లల్లో అవగాహన పెంచడం విధిగా జరగాలి. కళకు చలించని లేదా స్పందిచని మనిషి లేడని గమనించి మనకు ఇష్టమైన కళలో శిక్షణ పొందడం లేదా కళాకారులను తట్టి ప్రోత్సహించడం నిరంతరం కొనసాగాయని ప్రపంచ కళా దినోత్సవం స్పష్టం చేస్తున్నదని మరువరాదు.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# తలుపులు లేని ఆలయం-సూళ్లూరుపేట చెంగాళమ్మ తల్లి



మన దేశంలో ఎన్నో ఆలయాలు. ఒక్కో ఆలయం వెనుక ఒక్కో అద్భుతమైన చరిత్ర దాగి ఉంటుంది. వాటిల్లో కొన్ని ఆలయాల చరిత్ర వింటే ఆశ్చర్యంతో పాటు ఒళ్లు గగుర్పొడుస్తుంది. అలాంటి ఒక మహిమాన్వితమైన ఆలయం ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులో ఉంది. భక్తులు 24 గంటలు తనను దర్శించుకోవడానికి వీలుగా ఆ తల్లి తన ఆలయానికి తలుపు పెట్టవద్దని ఆదేశించిందిఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దులో ఉన్న సూళ్లూరుపేట లో చెంగాళమ్మ తల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా వెలసి ఉంది. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌కి ఒకటిన్నర కి.మీ దూరంలో ఉంది. ఇటు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే భక్తులతో పాటు పొరుగు రాష్ట్రమైన తమిళనాడు నుంచి కూడా చెంగాళమ్మ దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. గతంలో ఈ ప్రాంతాన్ని శుభ గిరి అనేవారు ఈ శుభ గిరికి పశ్చిమాన కాళంగి నది ప్రవహిస్తూ ఉంటుంది. చెంగాళమ్మ తల్లి ఇక్కడ స్వయంభువుగా వెలసినట్లు ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

స్థల పురాణం


కొన్ని శతాబ్దాల క్రితం ఒక రోజున యీ కాళంగి నదీ తీరానికి ఒక రాతి విగ్రహం కొట్టుకుని వచ్చింది. అక్కడ ఉన్న కొందరు పశువుల కాపరులు ఆ విగ్రహాన్ని చూసి,ఆ విషయాన్ని గ్రామ పెద్దలకి చెప్పగా వారు వచ్చి చూసి అది అమ్మవారి విగ్రహం అని తెలుసుకున్నారు. తరువాత గ్రామ పెద్దలందరు కలసి ఆ విగ్రహాన్ని గ్రామంలోనికి తీసుకువచ్చి ప్రతిష్ఠించి, ఆలయం నిర్మించాలను కున్నారు. బాగా రాత్రి కావడంతో ఉదయాన్నే ఆలయ నిర్మాణం సంగతి చర్చించాలని నిర్ణయించుకుని అందరూ తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఆ రాత్రి ఒక వింత జరిగింది. నదీ తీరాన శయన భంగిమలో వున్న ఆ అమ్మవారి విగ్రహం లేచి దక్షిణ ముఖంగా నిలబడింది. మరునాడు వచ్చి చూసిన గ్రామస్థులకు, విగ్రహం నిలబడి ఉండటం ఆశ్చర్యం కలిగించింది. వారందరు కలిసి అమ్మవారి విగ్రహాన్ని గ్రామం లోపలికి తీసుకుని వెళ్లడానికి ఎంతో ప్రయత్నించారు కాని విగ్రహాన్ని ఒక్క అడుగు కూడా కదల్చ లేకపోయారు. చివరకు నిస్పృహతో ఆ విగ్రహాన్ని అక్కడే వదిలి జనం ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

చెంగాళమ్మ స్వప్న సాక్షాత్కారం

ఆ రోజు రాత్రి అమ్మవారు ఆ గ్రామ పెద్దకు స్వప్నంలో సాక్షాత్కరించి తాను ఉన్న ప్రదేశంలో నిలబడి ఉన్నట్లు తనకి ఆలయం నిర్మించమని ఆదేశించింది. అమ్మవారి ఆదేశం మేరకు గ్రామస్థులందరూ కలిసి విరాళాలు పోగు చేసి అమ్మవారికి ఆలయ నిర్మాణం చేశారు.

# హరిహరసుతుడు అయ్యప్ప స్వామి జయంతి





హరిహరసుతుడు అయ్యప్ప స్వామి వెలసిన శబరిమల ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. సాధారణంగా హిందూ దేవాలయాలన్నీ ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచే తెరచుకుంటాయి. కానీ శబరిమల ఆలయంలో అయ్యప్ప స్వామి దేవాలయం మాత్రం సంవత్సరంలో కొన్ని రోజులు మాత్రమే తెరచుకుంటుంది. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకునే వీలు కలుగుతుంది.ఈ రోజుల్లో శబరిమల కొండలన్నీ అయ్యప్ప నామ స్మరణతో మారుమ్రోగుతుంటాయి. పంబ నది దగ్గర నుంచి శబరి గిరులన్నీ అయ్యప్ప స్వామి భక్తులంతా నిండిపోతాయి. సాధారణంగా విజయదశమి నుంచి మకర సంక్రాతి వరకు శబరిమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ఏప్రిల్ నెలలో వచ్చే అయ్యప్ప స్వామి జయంతి కూడా శబరిమలలో ఘనంగా జరుగుతుంది. .అయ్యప్ప స్వామి జననం క్షీరసాగర మధనంలో ఉద్భవించిన అమృతాన్ని దానవులకు అందకుండా దేవతలకు పంచడానికి శ్రీ మహావిష్ణువు మోహినీ అవతారాన్ని స్వీకరిస్తాడు. పరమేశ్వరుడు మోహిని అవతారాన్ని చూసి మోహిస్తాడు. ఆ సందర్భంగా హరిహరుల అంశగా అయ్యప్పస్వామి జన్మిస్తాడు. అసుర సంహారం తరువాత అయ్యప్పస్వామి శబరిమలలో వెలిసాడు.

అయ్యప్పస్వామి జన్మదినం ఎప్పుడు?

సాధారణంగా ఏప్రిల్ నెల అంటే తెలుగు పంచాంగం ప్రకారం చైత్ర మాసం, కేరళ, తమిళనాడులో చిత్తిరై మాసంలో ఉత్తరా నక్షత్రం రోజున అయ్యప్ప స్వామి జన్మదినం ఘనంగా జరుపుకుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ 15, బుధవారం రోజు అయ్యప్ప స్వామి జయంతి జరుపు కోనున్నాం. అయ్యప్పస్వామి జ్యోతి రూపంగా అంతర్థానమైన రోజు మకర సంక్రాంతి. అందుకే ఈ రోజు శబరిగిరుల్లో జ్యోతి దర్శనం నిర్వహిస్తారు.అయ్యప్ప స్వామి జయంతి సందర్భంగా స్వామి వారు శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానం నుంచి ఏనుగు పై పంబ నదికి వచ్చి స్నానం చేసి, తిరిగి శబరిమల చేరతారు. ఇది శబరిమలలో జరిగే ప్రత్యేక ఉత్సవం. ఈ సందర్భంగా పందళం వద్ద వలియా కోయిక్కల్ ఆలయం అయ్యప్ప జయంతిని ఘనంగా నిర్వహిస్తుంది. ఉదయం 4 గంటలకు మేల్కొలుపుతో ప్రారంభమయ్యే ఉత్సవాలు సాయంత్రం వరకు కొనసాగు తాయి. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి తిరు వాభరణాలు ఉంచిన పెట్టెలను స్రంపికల్ పాలస్ నుంచి ఊరేగింపుగా వాలియకోయిక్కల్ ఆలయానికి తీసుకెళ్తారు.

పంబా నది స్నానం

శబరిమలలో ఈ సందర్భంగా అయ్యప్ప ఉత్సవమూర్తికి పంబా నదిలో పవిత్ర స్నానం ఆచరిస్తారు.

పవిత్ర దర్శనం

వాలియకోయిక్కల్ ఆలయంలో తిరువాభరణాలు ధరించిన అయ్యప్ప స్వామి భక్తులు ఉదయం 11 గంటల వరకు దర్శించుకోవచ్చు. సాయంత్రం వేళల్లో జరిగే తిడంబు ఊరేగింపును కూడా భక్తులు వీక్షించవచ్చు. ఈ సందర్భంగా జరిగే సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్సవ వేడుకలు, కేరళ సాంప్రదాయ నృత్య వేడుకలు కోలాహలంగా జరుగుతాయి.

# భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### వెన్నంపల్లిలో వ్యవసాయ భూములను పరిశీలించిన కలెక్టర్

### ఆన్‌లైన్ పెండింగ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం



మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో.. భూ సమస్యల పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. బుధవారం ఆయన కాల్వ శ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామంలో పర్యటించి, పలు వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా 'భూభారతి' పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ రాముడు, రెవెన్యూ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలి



కరీంనగర్, బ్యూరో మెట్రో న్యూస్‌తెలంగాణలో మార్చి 2024 తర్వాత రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, దీంతో ఎంతో మంది అవస్థలు పడుతున్నారని తక్షణమే వాటిని విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన సమయం విరామంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ భాష జాలి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు గెజిటెడ్ అధికారులు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే ఎస్సై శేఖర్ రెడ్డి




శంకరపట్నం, మెట్రో న్యూస్ శంకరపట్నం మండల కేంద్రంలో ఆల్ఫ్రెడ్ నోబెల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్ సీట్ బెల్ట్ సేఫ్ రోడ్ క్రాసింగ్ స్కూల్ బస్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడారు ప్రత్యేక డ్రైవ్ లో మైనర్లు డ్రైవింగ్ చేయడం త్రిబుల్ రైడింగ్ నియమాలు పాటించాలని ఆటో డ్రైవర్లు నియమాలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడును చెప్పారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పోస్ట్ కార్డు ద్వారా రోడ్ సేఫ్టీ నియమాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## 'పిల్లలు అనుక్షణం జ్ఞానాన్వేషణ చేయాలి '

### - రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య



మెట్రో న్యూస్, శ్రీరాంపూర్. పాఠశాల పిల్లలు మంచి అలవాట్లను కలిగి ఉండటంతో పాటు అనుక్షణం జ్ఞానాన్వేషణ చేయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కోరారు. బుధవారం కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి పెండ్లి నితీష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన జన్మదినం సందర్భంగా అందంగా ముస్తాబై పాఠశాలకు వచ్చిన బాలుడు నితీష్ తోటి సహచరులతో కలిసి సంతోషంగా గడిపారు. నితీష్ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో విలసిల్లాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. వారు స్వీట్లు తినిపించి, అబ్బాయిని దీవించి, ఆశీర్వదించారు. అతనికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ పిల్లల సంతోషం కోసమే పాఠశాలలోని ప్రతి విద్యార్థి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని, ఊషన్నపల్లి పాఠశాలఅభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పిల్లల చదువు, సంస్కారం, సత్ప్రవర్తన, క్రమశిక్షణ, సకల కళలతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఈర్ల సమ్మయ్య తెలిపారు. సకల సౌకర్యాలతోపాటుగా, చక్కటి ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తున్న ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే పిల్లల్ని చదివించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, ఎడ్ల స్రవంతి, గోపిశెట్టి సుప్రియ, తల్లిదండ్రులు, పిల్లలు, పలువురు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల వ్యవసాయ శాఖ అధికారి

మెట్రో న్యూస్, శ్రీరాంపూర్. పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టినటువంటి సంధ్య వీరికి స్థానిక శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారు రమేష్ స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేస్తూ మండల గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి రైతులకు తగు సేవలు అందించాలని వారు కోరడం జరిగినది. శ్రీరాంపూర్ ఏఈఓ గా రైతులకు సేవలు అందించి అనంతరం ఓదెల మండలం నాకు ట్రాన్స్ఫర్ గా వెళ్లి అక్కడ ఏ ఈ ఓ గా పనిచేసి రైతుల మండల పొందుతూ శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన వీరు శ్రీరాంపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టడం ఆ గ్రామ ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బంగారు రమేష్ వెంట మాదాసు సతీష్ రైతులు నరసింహారెడ్డి అక్కల బాపన్న ఏఈఓ శ్రీరాంపూర్ తదితరులు పాల్గొన్నారు.

## అ ని శా వలలో మున్సిపల్ ఏఈ



హుజురాబాద్ ప్రతినిధి (మెట్రో న్యూస్): హుజురాబాద్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఏ.ఈ సుధాకర్ రెడ్డిని ఓ కాంట్రాక్టర్ వద్ద 50,000 లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ పొన్నం చందర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ కు రావలసిన డబ్బుల కోసం అడిగితే లంచం ఇవ్వాల్సిందిగా సుధాకర్ రెడ్డి డిమాండ్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించగా హుజురాబాద్ బస్ డిపో ప్రాంతంలో లంచం తీసుకుండగా సుధాకర్ రెడ్డిని పట్టుకున్నట్టు తెలిపారు. గత సంవత్సరంలో డ్రైన్ నిమిత్తం కాంట్రాక్టర్ 24 లక్షల పనిచేశాడని, మున్సిపల్ ఆఫీస్ నుంచి రావాల్సిన డబ్బుల కోసం వస్తే ఏఈ సుధాకర్ రెడ్డి డబ్బులు అడిగారని బాధితుడు తెలిపినట్టు పేర్కొన్నారు.

## నడింపల్లి, రంగాపురం గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బీపీ మిషన్ల పంపిణీ.

మెట్రో న్యూస్ అచ్చంపేట (ఏప్రిల్ 15):గ్రామీణ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో'మీ కోసం హెల్త్ & ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ' ఆధ్వర్యంలో, 'లైఫ్ సేవ్ కంపెనీ' వారి ఆర్థిక సహకారంతో అచ్చంపేట మండలంలోని నడింపల్లి మరియు రంగాపూర్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు ఉచితంగా బీపీ మెషిన్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ చౌహాన్ మాట్లాడుతూ (హైపర్‌టెన్షన్) అనేది ఒక సైలెంట్ కిల్లర్. దీనిపై గ్రామాల్లో అవగాహన పెంచుకోవాలని. తరచుగా పరీక్షలు చేయించుకోవడం అనే మా చిన్న ప్రయత్నం అని, ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని" అని వివరించారు. సరైన వైద్య సదుపాయాలు మరియు ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యకరమైన పల్లెలను నిర్మించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో నడింపల్లి సర్పంచ్ గోపి పద్మా అజయ్, రంగాపూర్ సర్పంచ్ సుజాత బాలు నాయక్, దర్గా తండా సర్పంచ్ శివ నాయక్, స్థానిక ఆరోగ్య సిబ్బంది (ఏఎన్ఎం ఆశ ఆశా కార్యకర్తలు), గ్రామ యువకులు అఖిల్ రెడ్డి, కాట్రావత్ జ్యోతి, అనిల్, కృష్ణ, పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత

### రాయికల్ తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15 (మెట్రో న్యూస్) : భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం తహసిల్దార్ కార్యాలయంను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ, సాధాబైనామ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులను ఆదేశించారు. జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. జనగణనకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు, గనుల ప్రమాదాలపై అప్రమత్తత అవసరం: గోల్డెన్ అవర్‌లో చికిత్సే ప్రాణ రక్షణకు కీలకం

### కరీంనగర్ మెడికవర్ వైద్యుల సూచనలు




మెట్రో న్యూస్ గోదావరిఖని. రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాలు, బొగ్గుగనుల్లో జరుగుతున్న ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్య సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి రోగిని తరలిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేశ్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. సింగరేణి ప్రాంతాల్లో గనుల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటి సందర్భాల్లో వేగవంతమైన వైద్య చికిత్స అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రమాదాల్లో తలకు గాయాలు ప్రధాన కారణమవుతున్నాయని, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సీటీ స్కాన్ వంటి పరీక్షలు చేయడం ద్వారా అంతర్గత గాయాలను త్వరగా గుర్తించి సమయానుకూలంగా చికిత్స అందించవచ్చని వివరించారు. పాలీట్రామా అంటే ఒకే రోగికి శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతినే పరిస్థితి అని, ఇలాంటి క్లిష్ట కేసుల్లో న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని రకాల నిపుణులు అందుబాటులో ఉండే ఆసుపత్రుల్లోనే ఇలాంటి కేసులకు సమర్థవంతమైన చికిత్స సాధ్యమవుతుందని చెప్పారు. ఇంటి వద్ద జరిగే చిన్న గాయాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదని, వెంటనే వైద్య చికిత్స పొందాలని సూచించారు. చిన్న గాయం అనుకుని వదిలేస్తే అది పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రమాదాల్లో రోగి స్పృహలో లేని పరిస్థితుల్లో న్యూరోసర్జన్‌తో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి డిమాండ్




మెట్రో న్యూస్ రామగుండం: రాష్ట్రవ్యాప్తంగా గత వారం రోజులుగా విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తెలిపారు. బుధవారం రామగుండం మండలం మల్యాలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో నిరవధిక సమ్మె చేపట్టిన కార్మికులకు ఆయన ప్రత్యక్షంగా కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు:హామీలు ఏమయ్యాయి?: గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాదయాత్ర సమయంలో ఆర్టిజన్లకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం దారుణమని విమర్శించారు. ప్రాణాలకు తెగించి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను తక్షణమే రెగ్యులర్ చేయాలని, పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల బెనిఫిట్స్, రూల్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులు పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని హరీష్ రెడ్డి మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన కోరారు. ఆర్టిజన్ల పోరాటంలో బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధికార ప్రతినిధి ఎండీ జాహిద్ పాషా, బూరుగు వంశీకృష్ణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ యాత్రికులకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ సర్టిఫికెట్

కరీంనగర్ బ్యూరో మెట్రో న్యూస్ అమర్నాథ్ యాత్ర-2026 కు సంబంధించి యాత్రకు వెళ్ళ దలిచే భక్తులు తప్పనిసరి ఆరోగ్య ధృవీకరణ పత్రం కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పొందవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ యాత్రకు వెళ్లాలనుకునే భక్తులకు ఈ సర్టిఫికెట్ తప్పనిసరి అని, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో యాత్రికులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధృవీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు.

## ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



చిగురుమామిడి : (మెట్రోన్యూస్) చిగురు మామిడి మండల కేంద్రంలోని డార్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ దూలం పృథ్విధర్ గౌడ్ ఎరైవ్- ఎలైవ్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..రోడ్డుపై యాక్సిడెంట్లు, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, వితౌట్ సేఫ్ టు బెల్ట్, వితౌట్ హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి చట్ట విరుద్ధమైన డ్రైవింగ్ లకు పాల్పడితే పోలీసులు చట్టపరమైన శిక్షలు విధిస్తారని తెలిపారు. వాహనాలపై డ్రైవింగ్ చేసేటప్పుడు రోడ్డు భద్రత సూచనలు అందరూ పాటించాలని కోరారు. అనంతరం వేర్ హెల్మెట్ డాడ్ బై వన్ ఫర్ మామ్ అండ్ మీ అనే పోస్టర్లు విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు స్వీయ నియంత్రణ తప్పనిసరి





### -నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే పెరుగుతున్న ప్రమాదాలు

### -రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నిజామాబాద్, ఏప్రిల్ 15 ( మెట్రోన్యూస్ )నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం నిజామాబాద్ శివారులోని సుగుణ గార్డెన్స్ లో పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్-అలైవ్ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎం.డీ నాగిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేకూరుస్తున్నారని, ఎవరికివారు తమవంతు బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ ను విధిగా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని హితవు పలికారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులై నిండు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని, తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ చలానాలు విధించినా, ఎన్ని చట్టాలు వచ్చినా, ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి కఠిన చర్యలు చేపట్టినా కూడా, ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పు రానంతవరకు రోడ్డు ప్రమాదాల పరిస్థితిలో మార్పు రాదని అభిప్రాయపడ్డారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ లో భాగంగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని గుర్తు చేశారు. ఇదిలాఉండగా, నిజామాబాద్ జిల్లాకు త్వరలోనే కొత్త బస్ డిపో రానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ప్రతిరోజూ 10వేల బస్సులు సుమారు 35 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ, 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆర్టీసీ సంస్థ పరిరక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రవాణా శాఖ పరంగా కూడా చెక్ పోస్టులు ఎత్తివేయడం వంటి అనేక నూతన సంస్కరణలను అమల్లోకి తెచ్చామని గుర్తు చేశారు.రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో మన దేశంలో ప్రతి ఏటా లక్షా 50 వేల మంది, రాష్ట్రంలో 7వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వీటిలో సుమారు 45శాతం వరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించి ప్రమాదాలకు నియంత్రించేందుకు కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయి చైతన్యలు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, రాంగ్ సైడ్ వెళ్లడం, సిగ్నల్స్ జంప్ చేయడం తదితర కారణాల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాల సంఖ్య పెరిగేందుకు కారణమవుతోందని అన్నారు. అతివేగాన్ని మానుకోవాలని, రోడ్డు భద్రతా నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో అప్రమత్తతో వాహనాలు నడపాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి బాధితులు వెల్లడిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు. అతి వేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపి తమ లాంటి దుస్థితిని కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేయడం అందరినీ ఆలోచింపజేసింది. రహ్ వీర్, పీ.ఎం రాహత్, హిట్ అండ్ రన్ లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు, ప్రోత్సాహకాలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు వీలుగా రూపొందించిన గోడ ప్రతులను, కర పత్రాలను మంత్రి ఆవిష్కరించారు. రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, డాక్టర్ కవితా రెడ్డి, డీటీసీ దుర్గా ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు




### -కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, ఏప్రిల్ 15 ( మెట్రోన్యూస్ )జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భీంగల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎం.పీ.ఓ లు ఇతర అధికారులతో కలెక్టర్ తాగునీరు సరఫరా తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించారు.ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, చేతి పంపులకు ఫ్లషింగ్ చేయించాలని అన్నారు. జూన్ లో విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నందున హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ళకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నివాస ప్రాంతాలతో పాటు అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలకు సమృద్ధిగా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఆవాసంలో ఒక్కో నివాస గృహం వారీగా శుద్ధి జలాలు అందేలా నీటి సరఫరా వ్యవస్థను చక్కదిద్దాలని, కుళాయిల బిగింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయించాలన్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పట్టణాలలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎక్కడైనా లోపాలను గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఎంపీఓలు, ఏ.ఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఏ.ఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

**తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు**

అన్ని అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమ్గల్ మండలం గోన్ గొప్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

### -రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### -బైక్ ర్యాలీ, మానవహారం

### -మంత్రి పొన్నంకు ఘన స్వాగతం పలికిన కలెక్టర్, సీ.పీ, జిల్లా అధికారులు




నిజామాబాద్, ఏప్రిల్ 15 ( మెట్రోన్యూస్ )రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్ అలైవ్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిజామాబాద్ నగర పర్యటనకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నిజామాబాద్ చేరుకున్న మంత్రిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో పాటు అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, ఇతర జిల్లా అధికారులు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా మంత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకోగా, అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా అధికారులతో పాటు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మానవహారంలో భాగస్వాములు అయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఎన్ని చట్టాలు నిబంధనలు అమలు చేసినా, ప్రజలలో మార్పు రానంత వరకు ప్రమాదాలను నిలువరించడం సాధ్యం కాదని అన్నారు. దీనిని గుర్తిస్తూ పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం అరైవ్ అలైవ్ పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు దోహదపడాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని రహ్ వీర్ కింద రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం ద్వారా అందజేయబడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పుతో దళిత క్రైస్తవులు అన్యాయం

### -క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్

### -పాల్గొన్న క్రైస్తవ హక్కుల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్.. రమేష్ జాన్, దళిత సంఘ నేతలు




ఆర్మూర్, ఏప్రిల్ 15 ( మెట్రో న్యూస్ ) : దళితులు క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీలుగా వర్తించరని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం దళితులకు అన్యాయం చేయడమేనని క్రైస్తవ హక్కుల రక్షణ సమితి అష్ట అధ్యక్షుడు డాక్టర్ అశోక్, క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ చెప్పారు. ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితులు క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సి హోదా రద్దు చేయడం పై సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని కోరారు. మతం వేరు కులం వేరు అని ఈ రెండింటిని వేరువేరుగా చూడాలన్నారు. క్రైస్తవ మతంలోకి మారితే దళితులకు ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టడం వర్తించదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం వలన అణగారిన దళితులకు అన్యాయం జరిగినట్లని పేర్కొన్నారు. హిందువులలోని ఇతర కులస్తులు క్రైస్తవ మతంలోకి మారిన బీసీలుగానే పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. దళితులు మతం మారితేనే ఎస్సి హోదా పోతుందా అని వారు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు మత స్వేచ్ఛను, ప్రాథమిక హక్కులను కాలరాస్తుందని చెప్పారు. దళితులు కాకుండా ఇతరులు క్రైస్తవులుగా మారితే రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని చెప్పారు. మతం, కులాలు వేరు కాబట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ చట్టాలను వర్తింపజేయాలన్నారు. సుప్రీంకోర్టు దళిత క్రైస్తవులకు ఇచ్చిన తీర్పును తొలగించాలని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి బి దేవరాం, ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ మండల చైర్మన్ మూగ ప్రభాకర్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లను తొలగిస్తామనడం సమంజసం కాదన్నారు. అగ్రవర్ణాలకు సైతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అణగారిన వారిని రిజర్వేషన్లు తొలగిస్తే సమిష్టిగా ఉండి ఉద్యమిస్తామన్నారు. దళిత క్రైస్తవులపై ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం పునః సమీక్షించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆర్మూర్ క్రైస్తవ అసోసియేషన్ మండల అధ్యక్షులు జాన రమేష్, మండల ప్రధాన కార్యదర్శి పాస్టర్ రాజ్ పాల్ దినకర్, పాస్టర్ ప్రకాష్, పాస్టర్ ఆగస్టిన్ పాల్గొన్నారు.

## గర్గుల్ విద్యార్థిని వీణ ను అభినందించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి ఏప్రిల్ 15 ( మెట్రో న్యూస్)కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కలిగోట వీణ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ గర్వకారణంగా నిలిచింది. ఇటీవల రాంచీ, రాజగిర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్‌లలో ఆమె అద్భుత ప్రదర్శనతో భారత జట్టుకు ఎంపికైంది. ఈ ఇండియన్ టీం క్యాంప్ ఏప్రిల్ 19 నుండి భోపాల్‌లోని ఎస్ ఏ ఐ సెంటర్‌లో నిర్వహించబడనుంది. ఇక్కడి నుంచే జపాన్‌లో జరగనున్న సబ్ జూనియర్ (యు-18) ఆసియా కప్‌కు భారత జట్టు కు ప్రాతినిధ్యం వహించనుంది.అండర్ 18 ఇండియన్ టీం కి సెలెక్ట్ అయిన కలిగొట వీణ ను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం తన చాంబర్ లో అభినందించి, శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

## జిల్లా కేంద్రంలో నారీ శక్తి వందన్ ర్యాలీ

### -మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఒక చరిత్రాత్మక ఘట్టం..

### -అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్




నిజామాబాద్, ఏప్రిల్ 15( మెట్రోన్యూస్ ) నారీ శక్తి...దేశానికే శక్తి అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నాందేవ్ వాడ శివాజీ చౌక్ నుంచి ఉమా మహేశ్వరాలయం వరకు నారీ శక్తి వందన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా స్వతంత్రం చేయడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు పెంచడం, మహిళల హక్కులు రక్షించడం.. నారీ శక్తి అభియాన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. మహిళల పాత్ర కుటుంబం నుంచి దేశాభివృద్ధి వరకు కీలకం కానుందన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇది కేవలం ఒక పథకం కాదని, మహిళలను సమాన హక్కులతో సమాజంలో ముందుకు తీసుకెళ్లే మహత్తర ఉద్యమం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏళ్ళుగా అమలు చేయని మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోదీ చేస్తున్నారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని, ఆ దిశగానే అడుగులు వేస్తున్నారని చెప్పారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకురాలు, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమంలో మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, విప్ న్యాలం సునీత, కార్పొరేటర్లు కల్పే అర్చనా, వైష్ణవి, ఇప్పకాయల సుమిత్ర, కాంపల్లి మమత, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యం..





### సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలనే రైతులు వాడాలి..

### తెలంగాణ విత్తనాభివృద్ధి శాఖ చైర్మన్ అన్వేష్ రెడ్డి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..

కరీంనగర్, బ్యూరో మెట్రో న్యూస్‌జిల్లాలో రాబోయే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తన కొరత లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని దీంతోపాటు నాణ్యమైన విత్తనాలను తమ సంస్థ ద్వారా అందిస్తామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు.వానా కాలం సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే అంశంపై బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కే ప్రతినిధులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.
సీడ్స్ కార్పొరేషన్ కరీంనగర్ యూనిట్ రంగపేట నుంచి నాణ్యమైన విత్తనాలను ఉమ్మడి జిల్లా రైతులకు సరఫరా చేస్తామని తెలిపారు.

**రైతుల వద్దే ఉత్పత్తి.. పరీక్షల తర్వాతే పంపిణీ..**

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పనితీరును చైర్మన్ అన్వేష్ రెడ్డి వివరించారు. మన రైతులు పండించిన విత్తనాలనే సేకరించి, వాటిని అధునాతన ల్యాబ్‌లలో పరీక్షించి, నాణ్యత నిర్ధారణ అయిన తర్వాతే తిరిగి రైతులకు సాగు కోసం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీలకు దీటుగా ప్రభుత్వ విత్తనాల నాణ్యత ఉంటుందని అన్వేష్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్నారకల్లో ప్రధానంగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 జేజీఎల్ 27356 రకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దొడ్డు రకాల విషయానికి వస్తే కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 రకాలను నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుమును పిల్లిపెసర రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.డీలర్లు ఎట్టి పరిస్థితులో సంస్థ విత్తనాలు అమ్మాల్సిందేననిసూచించారు. కేవలం రాయితీపై ఇచ్చే విత్తనాల విక్రయానికే పరిమితం కాకుండా, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. లైసెన్స్ ఉన్న ప్రతి డీలర్ తప్పనిసరిగా ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను తమ తమ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాటిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ రైతులకు విక్రయించాలని సూచించారు.

**జిల్లాలో వరి సాగు విస్తీర్ణం**

సుమారు 2.8 లక్షల ఎకరాలు వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. సుమారు 60వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. కనీసం 25 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను సంస్థ ద్వారా సరఫరా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గ్రామాల్లో మహిళా సంఘాలు ప్రభుత్వ విత్తనాలను విక్రయించేందుకు పెద్ద ఎత్తున సహకరించాలని కోరారు. "రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా రక్షణ కల్పించడంతో పాటు, నిజాయితీగా వ్యాపారం చేసే డీలర్ల హక్కులను నూతన విత్తన చట్టం కాపాడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి అటు రైతులు సంస్థ అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

**గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాల విక్రయానికి ప్రత్యేక ప్రణాళిక..**
**స్వశక్తి మహిళలు వ్యవసాయ అధికారులతో కలిసి కృషి చేస్తాం..**

గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాలను రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా ప్రత్యేక ప్రణాళిక రచిస్తున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఇందుకోసం స్వశక్తి మహిళా సంఘాలు వ్యవసాయ అధికారులు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వ విత్తనాల విక్రయం పై విస్తృతంగా గ్రామ గ్రామానా మార్కెటింగ్ నిర్వహించి పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా రైతులను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. త్వరలో జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ విత్తనాల విక్రయం పై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మోసపూరిత ప్రకటనల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డిఓ కే మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా సహకార అధికారి సీడ్ కార్పొరేషన్ మేనేజర్ రాజీవ్ కుమార్, కరీంనగర్ ప్రాంతీయ మేనేజర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు సబిత, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, విత్తన అధికారులు శ్రీకాంత్, మౌనిక, డీలర్లు, ఎఫ్‌పీఓ మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో దళితులకు జరిగిన అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

### దళితుల పట్ల వివక్ష పాటించిన ఆధిపత్య నాయకులు

### ప్రతి నెల 30వ తారీఖున సివిల్ డెస్క్ డే ను నిర్వహించాలి

(మెట్రో న్యూస్):అడ్డాకుల మండల పరిధిలోని వర్నే గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ను, దళితులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు మండల నాయకులతో కలిసి అడ్డాకుల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, తాసిల్దార్ శేఖర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వర్ని గ్రామంలో మంగళవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో దళితులకు జరిగిన అవమానంపై ధర్నా ఉద్దేశించి మండల కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 14న




అంబేద్కర్ జయంతి రోజు వార్నే గ్రామంలోనీ శివాలయం దగ్గర గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ పెద్దల సమక్షంలో దళిత యువకులందరూ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు.జయంతి సందర్భంగా దళితులు, గుడి ఆవరణంలో తిరగటం వల్ల గుడి ఆపరిశుభ్రమైందని, జయంతి అనంతరం ఆధిపత్య కులానికి చెందిన వారంతా కలిసి గుడి మైలబడిందని పూజారిచే గుడిని శుభ్రం చేయించారు.
ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, అంబేద్కర్ ను అంబేద్కర్ ఆశయాలను అవమానించిన, దళితుల పట్ల వివక్షత పాటించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ధర్నా అనంతరం తాసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.
అడ్డాకుల గ్రామంలో నేటి అనేక గ్రామాల్లో కుల వివక్షత అంటరానితనం కొనసాగుతుందని, ప్రతి నెల 30వ తారీకున జరిగే సివిల్ డెస్క్ డే ను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో నాగవర్ధన్ ప్రేమ్ కుమార్, నవీన్, ప్రకాష్ మహేందర్, సురేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### ఖమ్మం రూరల్ ఏసీపీ

### తిరుపతి రెడ్డి

ఖమ్మం మెట్రో ఈవినింగ్ ఏప్రిల్ 25:ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి అన్నారు. అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాలలో అరైవ్- అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విద్యార్థుకుల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ. స్కూల్ బస్సులో సురక్షితంగా ఎక్కడం, దిగడం ఎలా, వరుసలో నిలబడాలని, తోపులాటలు మానుకోవాలని, బస్సు పూర్తిగా ఆగే వరకు వేచి ఉండాలని, ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు చేతి పట్టులను (హ్యాండ్‌రైల్స్‌ను) ఉపయోగించాలని, కదులుతున్న బస్సు నుంచి ఎప్పుడూ దిగడానికి ప్రయత్నించవద్దని విద్యార్థులకు సూచించారు.ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు తల్లి దండ్రులకు హెల్మెట్ ధరించాలని చెప్పాలన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు




బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు.. ఎరుపు అంటే ఆగడం, ఆకుపచ్చ అంటే వెళ్లడం, పసుపు అంటే వేగాన్ని తగ్గించడం అన్నారు.వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్‌ను ఎప్పుడూ ఉపయోగించవద్దని సూచించారు. మైనర్లు వాహనాలను నడపవద్దన్నారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై నాగారాజు, గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాల కరస్పాడెంట్ ఎండీ ఎర్షాద్ అహ్మద్, ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి, దామల్ల పాపారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

### ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు




మెట్రో న్యూస్ బిజినపల్లి 15 ఏప్రిల్ మండలం పాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ స్వయం ప్రతిపత్తి (అటానమస్) కళాశాలలో 2026ఉ27 విద్యాసంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సేవలు (దోస్త్) విధానం ద్వారా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ సంవత్సరం డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏప్రిల్ 15 నుండి మే 7 వరకు కొనసాగుతుందని, అనంతరం వెబ్ ఆప్షన్స్ నమోదు ఏప్రిల్ 30 నుండి మే 8 వరకు జరుగుతుందని తెలిపారు. మొదటి విడత సీట్ల కేటాయింపు మే 14న ప్రకటించబడుతుందని, ఎంపికైన విద్యార్థులు మే 15 నుండి 23వ తేదీ వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు.ఇక రెండవ విడత ప్రవేశాల ప్రక్రియ మే 15 నుండి జూన్ 5 వరకు, మూడవ విడత మే 31 నుండి జూన్ 25 వరకు కొనసాగుతుందని వెల్లడించారు. విద్యార్థులు తమ ఆసక్తులు, ప్రతిభ, భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని కోర్సులు మరియు కళాశాలలను వెబ్ ఆప్షన్స్ ద్వారా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.కళాశాల స్వయం ప్రతిపత్తి హోదాతో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తోందని ఆయన తెలిపారు. ఈ కళాశాలలో బి.ఏ, బి.ఏ (లాంగ్వేజెస్), బీకాం, బీఎస్సీ (లైఫ్ సైన్స్), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్), బీకాం (బి.ఎఫ్.ఎస్.ఐ), బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ వంటి విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఆధునిక ప్రయోగశాలలు, సమృద్ధిగా ఉన్న గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, విద్యార్థులకు అనుకూలమైన ప్రశాంత వాతావరణం వంటి అన్ని వసతులతో కళాశాల ఉత్తమ విద్యను అందిస్తున్నదని పేర్కొన్నారు. అదనంగా, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ ట్రైనింగ్, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సహాయం వంటి ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఈ కళాశాల మంచి అవకాశాలను కల్పిస్తూ ఉన్నత విద్యలో ముందుకు తీసుకెళ్తోందని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.డిగ్రీలో ఉన్నత విద్యను అభ్యసించా లనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని ఆకాంక్షించారు.

## పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని టిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు పిలుపు.

### టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పోకల మనోహర్.



మెట్రో న్యూస్ అచ్చంపేట (ఏప్రిల్ 15):అచ్చంపేట పట్టణంలోని 20 వార్డుల్లో బి.ఆర్.ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు పార్టీ సీనియర్ నాయకుడు కోకల మనోహర్ పిలుపునిచ్చారు. బుధవారం అచ్చంపేట బిఆర్ఎస్ పార్టీ అచ్చంపేట పట్టణ 20 వార్డుల ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ పార్టీ శ్రేణి నాయకుడు పోకల మనోహర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అచ్చంపేట మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని అందుకు ప్రతి కార్యకర్త ఆయా అవార్డుల్లో పార్టీ బలోపేతం చేసి పార్టీ విజయానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు తులసీరాం నాయక్ , నర్సింహగౌడ్ ,మైనారిటీ నాయకులు అమినుద్దీన్ ,పర్వతాలు కౌన్సిలర్ లు అంతటి శివ , కుతుబుద్దిన్,రమేష్ రావు ,పట్టణ ముఖ్య నాయకులు , యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం అందజేత



గద్వాల ఏప్రిల్ 15 (మెట్రో న్యూస్ )అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన ఉప్పరి శేషగిరి తండ్రి ఉప్పరి రంగన్నకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60,000 చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా అలంపూర్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్ బాధితునితో మాట్లాడారు.ప్రజాపాలనలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.ప్రతి కుటుంబం ఆరోగ్యంగా,ఆనందంగా జీవించాలని లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త పి. విశ్వనాథ రెడ్డి,పచ్చర్ల గ్రామ ఉపసర్పంచ్ రేపల్లె దావీదు,కొమ్ము భాస్కర్,రంగస్వామి,వార్డు సభ్యులు రాజు,మోషే లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన





### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ బ్యూరో మెట్రో న్యూస్ ఏప్రిల్ 15జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలో, అలాగే కొడకండ్ల మండల కేంద్ర పరిధిలో, అదే విధంగా కొడకండ్ల మండలంలోని మొండ్రాయి గ్రామ పంచాయతీలో కొనసాగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాల్లో నాణ్యత, పురోగతి, సౌకర్యాల అమలు వంటి అంశాలను సవివరంగా తనిఖీ చేశారు.ప్రతి ఇల్లు వద్ద గదుల నిర్మాణం, ప్లాస్టరింగ్ పనులు, తలుపులు, కిటికీల అమరిక, విద్యుత్, తదితరాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విధంగా ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అలాగే, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, ఇప్పటివరకు ఎన్ని విడతల్లో డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ఎదురవుతున్న సమస్యలు, అవసరాల గురించి ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.అదే విధంగా కొడకండ్ల మండలంలోని మొండ్రాయి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువలు నిరంతరం శుభ్రంగా ఉంచాలని, దోమల నివారణ కోసం ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, చెత్తతో కాలువలు మూసుకుపోకుండా జాగ్రత్త పడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.ఈ పరిశీలనలో గృహ నిర్మాణ పీడీ మాత్రు నాయక్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కోడపాక భూవివాద పరిష్కార దిశగా హద్దులు ఏర్పాటు చేస్తాం.

### ఆర్డీఓ హరికృష్ణ.

రేగొండ,ఏప్రిల్15(మెట్రో న్యూస్):గోరి కొత్తపల్లి మండలం చిన్న కోడపాక గ్రామంలో వివాదాస్పద భూమి పరిష్కారం కోసం సమగ్ర విచారణ మేరకు హద్దులు ఏర్పాటు చేస్తామని జిల్లా ఆర్డీవో హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం చిన్న కోడెపాక గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను ఆర్డిఓ హరికృష్ణ, తాసిల్దార్ హేమ సంబంధిత అధికారులతో వివాద భూమి సందర్శించారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై కలెక్టర్ రాహుల్ శర్మకు ఇటీవల సిపిఐ నాయకులు, ప్రజా ప్రతినిధులు వివిధ వర్గాల ప్రజలు ఫిర్యాదు మేరకు ఆర్డిఓ హరికృష్ణ సందర్శించారు.చిన్న కోడపాక గ్రామంలో అప్పటి ప్రభుత్వం 1983లో ల్యాండ్ పర్చేస్ కింద ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములను కొందరు దళారీలు దొంగ పట్టాలెక్కించుకోవడం జరిగింది దానిపై భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సిపిఐ సిపిఎం నాయకులు గుంటి చంద్రమౌళి పైల్ల శాంతి కుమార్ బొట్ల చక్రపాణి కలెక్టర్ ను కలిసి గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రీన్వెల్ సెల్లో పిటిషన్ వేయడం జరిగింది. దానికి స్పందించిన కలెక్టర్ ఆర్ డి ఓ ను చిన్న కోడెపాక కు పంపించడం జరిగినది. ఈ మేరకు బుధవారం ఆర్డిఓ హరికృష్ణ అధికారులతో కలిసి గ్రామ సర్పంచి సాధు సుమలత ధర్మేందర్ సమీక్షంలో చిన్నకోడపాక గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను పరిశీలించడం జరిగింది. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలువురు ఇచ్చిన వాంగ్మూలాన్ని ఆర్డీవో హరికృష్ణ అధికారులతో కలిసి నమోదు అనంతరం..అట్టి భూములను పట్టాలెక్కించుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విచారణ సందర్భంగా చెప్పడంతో ఆర్డిఓ స్పందించి పట్టాకాలంలో హౌసింగ్ ల్యాండ్ అని పెడతామని, ఇప్పటికే ఆ భూమి పక్కన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణాలు జరిగిన దృష్ట్యా ఆడియో హామీ ఇచ్చారన్నారు. ఈ హౌసింగ్ భూములను ఎవరు పట్టా ఎక్కించుకోకుండా హద్దులు నిర్ణయిస్తామని సర్వే చేయించి చుట్టూ హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమిని బోర్డు పెడతామని ఆర్డీవో హరికృష్ణ సిపిఐ సిపిఎం నాయకులకు గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో సమస్యకు పరిష్కారం లభించింది అని సిపిఐ, సిపిఎం నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ హరికృష్ణ సమక్షంలో





విచారణ చేపట్టడంతో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు యువకులు అన్ని పార్టీ ల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్శనలో ఆర్డీవో హరికృష్ణతోపాటు ఎమ్మార్వో హేమ, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు రాజ్యలక్ష్మి, సాగర్, జిపిఓ కుందూరు అమరేందర్ రెడ్డి, స్థానిక పంచాయతీ కార్యదర్శి వేల్పుల సరిత, సర్పంచ్ సాదు సుమలత ధర్మేందర్, ఉప సర్పంచ్ గట్టు ప్రదీప్ గౌడ్, వార్డు మెంబర్లు పొదిలి కృష్ణ , మార్క ముత్యం, రాములు,బండారి రవీందర్ గ్రామస్తులు కూనూరు రాజన్న బొట్ల చంద్రమౌళి బండారి కుమారస్వామి మోడం వెంకన్న మోడం సుభాష్ బండారి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలుపై జాప్యం రైతుల ఆగ్రహం

### నల్లబెల్లి రహదారిపై

### రాస్తారోకోతో నిరసన

మెట్రో ప్రతినిధి నల్లబెల్లి మండలం ఏప్రిల్ 15 మొక్కజొన్న కొనుగోళ్లు నిలిపివేయడంతో నల్లబెల్లి మండలంలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నల్లబెల్లి శనిగరం క్రాస్ వద్ద హైవేపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. కొనుగోళ్లు తిరిగి ప్రారంభించి వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఆశలు కలిగించినా, ప్రస్తుతం రైతులకు ఆవేదనగా మారింది. కనీస మద్దతు ధర 2400గా ప్రకటించినా ఆ ధరకు పంట అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు తెలిపారు.పదిహేను రోజులు గడిచినా కేవలం రెండు లారీలు మాత్రమే కొనుగోలు చేయగా, మరికొన్ని లారీల పంట కేంద్రం వద్దే పేరుకుపోయిందన్నారు. అధికారులు సమయానికి రాకపోవడంతో ఎండలో గంటల తరబడి వేచి



చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.త్రాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎండ తీవ్రతతో పాటు అకాల వర్షాల ముప్పు పంట నాణ్యతపై ప్రభావం చూపుతుందని రైతులు చెప్పారు.ప్రారంభంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రభుత్వాన్ని నమ్మి ఇబ్బందులు



పడుతున్నామని వాపోయారు. రోజురోజుకు ఆందోళన పెరుగుతోందని తెలిపారు.రాస్తారోకో కారణంగా హైవేపై వాహనాలు నిలిచిపోగా, పోలీసులు చేరుకుని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

# నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ మండల సభ.

### నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ మండల సభ.

### రేగొండ ఎంపీడీవో యం వెంకటేశ్వర్ రావు.

రేగొండ,ఏప్రిల్15(మెట్రో న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆవిష్కతపై నేడు (గురువారం) రేగొండ మండల



కేంద్రంలోని రైతు వేదిక మందిరంలో మండల సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యం వెంకటేశ్వర్ రావు తెలిపారు.

ఈ సమావేశానికి 99 రోజుల్లో వివిధశాఖ అధికారులు చేపట్టిన వివరాల జాబితాలతో సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు కోరారు. ఈ సర్వసభ్య సమావేశంలో సంబంధిత మా సర్పంచ్లతో పాటు వివిధ సంఘాల నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు.

సుల్తాన్పూర్ రైతు వేదికలో మండల సభ..

గోరి కొత్తపల్లి మండల పరిధి సుల్తాన్పూర్ గ్రామ రైతు వేదికలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై మండల సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గడ్డం రామ్ ప్రసాద్ రావు తెలిపారు. సమావేశానికి అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

# మార్కెట్ నిండా ధాన్యం రాశులు. పట్టించుకోని ప్రభుత్వం.

### రిబ్బన్ కటింగ్ లకే పరిమితమైన ఎమ్మెల్యే.

మక్కజొన్న రైతుల ముఖం చూడని ప్రభుత్వం.అరిగోస పడుతున్న రైతాంగం.

ఖానాపురం మెట్రో ఈవినింగ్ ఏప్రిల్ 15: ఖానాపురం మండల కేంద్రం వ్యవసాయ మార్కెట్ లోని మొక్కజొన్నల రైతులు




హరిగో పడుతున్న పట్టించుకునే నాధుడు లేరు అని ఈ సందర్భంగాబిఆర్ఎస్ నాయకులుమాట్లాడుతూ.ఖానాపురం మండలంలో 5000 ఎకరాలు మొక్కజొన్నలు రైతులు పండించారని దీన్ని కొనుగోలు చేయాల్సిన మార్క్ఫెడ్ ప్రభుత్వం నిమ్మకు నిరత్తినట్టు వివరించడం సిగ్గుచేటు అని అన్నారు.ఎమ్మెల్యే ప్రారంభం కంటే ముందు 20 రోజులు ఎమ్మెల్యే ప్రారంభం తర్వాత వారం రోజులైనా కొనుగోలుచేయకపోవడం వల్ల రైతులు తీవ్రఆందోళనలో ఉన్నారని ప్రభుత్వందున్నపోతు మీద వాన పడ్డట్లు వివరించడం ఏంటని ఇదేనా ప్రజాపాలన అంటూ ప్రశ్నించారు.మొక్కజొన్నలు ఎకరానికి దిగుబడి 40-45 క్వింటాలు మక్కలు దిగుబడి వస్తుంటే ప్రభుత్వం ఎకరాకు 26 క్వింటాల మక్కలు అంటూ ప్రకటన చేయడం పట్ల వీరి అవగాహన ఏంటో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు.వాతావరణంలో మార్పులు వస్తున్న కూడాఇంతవరకు ఒక్క గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు లేదని రైతుల స్పష్టం చేస్తున్నారని అన్నారు.పట్టా రైతులు కాకుండా,అసైన్డ్ భూముల్లో, ఆర్ఓఎఫ్ భూముల్లో మక్కలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయమంటూ ప్రభుత్వం మార్క్ ఫైడ్ అధికారులు వింత ప్రకటనలు చేస్తున్నారని దీనిని వెంటనే విరమించుకొని మండల వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం,స్థానికఎమ్మెల్యే మార్క్ ఫైడ్ అధికారులు వెంటనే స్పందించి మూడు రోజుల్లో కొనుగోలను వేగవంతం చేయాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్ బందారపు శ్రీనివాస్ యాకుబ్ పాషా ఉప సర్పంచ్లు ఉప్పు రాజు సింగు సుధాకర్ భూషబోయిన రాజు మాజీ జెడ్పిటిసి గుగులోతు బాలునాయక్ మాజీ వైస్ ఎంపీపీ జాటోత్ బాలు నాయక్ మాజీ సర్పంచ్ వల్లెపు సోమయ్య మాజీ ఎంపిటిసి బోడ పూలునాయక్ మైనార్టీ సెల్ అధ్యక్షులు అజహార్ పార్టీ నాయకులు ఆబోతు అశోక్ గుండ్లపల్లి విజయ్ మర్రి రామస్వామి సిరిపోతుల వీరస్వామి అన్నబోయిన శ్రీను,సతీష్ గొంది నరసయ్య జాటోత్ హాలియా,గోపు హరి, బైరెడ్డి దామోదర్ రెడ్డి,భూక్య నవీన్,మాలోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### వంట నష్టం జరిగిన రైతులు అధైర్య పడకండి మీకు అండగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఉన్నారు

### నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన

### నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్



ఏప్రిల్ 15 మెట్రో ఈవినింగ్ నర్సంపేట నల్లబెల్లి మండలం మూడు చెక్కలపల్లి గ్రామం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మక్కజొన్న పంట దగ్ధం కావడం వల్ల నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలయి శ్రీనివాస్ కి ఆదేశాలు ఇవ్వడంతో వ్యవసాయ అధికారులతో కలిసి మూడు చెక్కల పల్లి గ్రామానికి వెళ్లి పంట నష్టపోయిన రైతులను కలిసి మీరు ధైర్యంగా ఉండండి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి జరిగిన నష్టం పై క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం కొరకు నివేదిక తయారు చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించడం జరిగినది మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు మీరు అధైర్య పడకండి ధైర్యంగా ఉండండి రైతులకు జరిగిన నష్టపరిహారం ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం నుండి అందే విధంగా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చినారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏడిఏ దామోదర్ రెడ్డి ఎమ్మార్వో కృష్ణ నల్లబెల్లి వ్యవసాయ అధికారి రజిత వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి నర్సంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి కిరణ్ నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ జిల్లా కాంగ్రెస్ సభ్యులు జిల్లా మునీందర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జెట్టి రామ్మూర్తి ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బౌసింగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల ఉపేందర్ రెడ్డి నల్లగొండ సుధాకర్ వేముల సంపత్ రెడ్డి వెంగళ దాస్ రమేష్ జంగిలి మోహన్ పోగుల కుమారస్వామి వైనాల పవన్ రఫీద్ నాయక్ సర్పంచ్ భూక్య భాస్కర్ రమణ మూడు చెక్కలపల్లి గ్రామ అధ్యక్షులు రమేష్ నాయక్ వెంకన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు

# శేరిలింగంపల్లి జోన్‌లో సమీక్షా సమావేశం సిఎంసి కమిషనర్ సృజన

**మెట్రో న్యూస్ ప్రతినిధి శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సిఎంసి కమిషనర్ జి సృజన బుధవారం జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూబీడీ ,యూసీడీ విభాగాల అధికారులుపాల్గొన్నారు.

**సమావేశంలోని ముఖ్య అంశాలలో గడువులోగా పనులు పూర్తి:**

ప్రస్తుతం కొనసాగుతున్న పనులన్నింటినీ 99 రోజుల ప్రోగ్రాంలో భాగంగా జూన్ 2, 2026 లోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కనీసం 190 పనులను ఈ గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**రోడ్ల నిర్వహణ:** జోన్‌లోని అన్ని రోడ్లకు ఎండ్–టు–ఎండ్ కార్పెటింగ్ చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా జూన్ 2 లోపు మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు.

**మురుగునీటి కాలువల పూడికతీత:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని




ఏప్రిల్ చివరి నాటికి జోన్ అంతటా పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజా సమస్యల పరిష్కారం:** వీధి దీపాల సమస్యలపై అసిస్టెంట్ ఇంజనీర్లు తక్షణమే స్పందించాలని, ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.ఆస్తుల వివరాలు: క్రీడా ప్రాంగణాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు వంటి ప్రభుత్వ ఆస్తుల పూర్తి సమాచారాన్ని సేకరించాలని, ఖాళీ స్థలాలకు 10 రోజుల్లోపు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పరిశుభ్రత & దోమల నివారణ: చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు మే చివరి నాటికి పూర్తి కావాలని, దోమల నివారణకు ప్రతి 10 రోజులకు ఒకసారి ప్రతి ప్రాంతంలో ఫాగింగ్/స్ప్రేయింగ్ జరిగేలా షెడ్యూల్ రూపొందించాలని కమిషనర్ తెలిపారు.

**జంక్షన్ల అభివృద్ధి:** జంక్షన్ల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులను వినియోగిం చుకోవాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, విభాగాల మధ్య సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాలను సకాలంలో చేరుకో వాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పురోగతిని పర్యవేక్షించేం దుకు ప్రతి వారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## బార్ అసోసియేషన్ సభ్యులను సన్మానించిన ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**మెట్రో న్యూస్ కడ్తాల్ :** టీపీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ బార్ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రములో జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేనావత్ బిక్యా నాయక్ తదితరులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన అండేకార్ యాదిలాల్‌తో పాటు ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి కానం గణేష్ గౌడ్ తదితరులను పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మాలె మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్,మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచుతాం : దొడ్ల



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్.టి.ఆర్ నగర్, పీజేఆర్ నగర్, గురుగోవింద్ సింగ్ నగర్ తదితర కాలనీలలో రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మున్సిపల్ అధికారులను కోరారు. స్థానికులతో కలిసి బుధవారం ఆయా ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో పాదయాత్ర చేసిన సమయంలో చెప్పినట్లు ఎన్.టి.ఆర్ నగర్ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న చెత్తను తొల గిస్తామన్నారు. దశలవారీగా అన్ని కాలనీలలోని రోడ్లపై ఉన్న చెత్తను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, తడి, పొడి చెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలు, రోడ్లు, చెరువులలో వేయవొద్దని ప్రజలకు సూచించారు. సీ.ఎం.సి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు గౌడ్, మల్లేష్, ఖలీమ్, నాగరాజు, సాయి, నరేష్, అక్బర్, ఎస్.ఆర్.పి నాగేశ్వరనాయక్, ఎస్.ఎఫ్.ఎ మల్లేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మధు యాష్కీ గౌడ్ తల్లి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**మెట్రో న్యూస్, చైతన్యపురి:** పీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ తల్లి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నివాళులుఎల్‌బి నగర్: పీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బి నగర్ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ మాతృమూర్తి అనసూయమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అనసూయమ్మ చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి, దీపారాధన చేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ, తన తల్లి అనసూయమ్మ చూపిన విలువలు, సేవా భావం, కష్టపడి పనిచేసే నైజంతనకుప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ అనసూయమ్మ సాధారణ జీవితం గడిపినా, సమాజానికి సేవ చేయాలనే తపన కలిగిన వ్యక్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ కాంపెయినింగ్ కమీటిస్టేట్ఎగ్జిక్యూటివ్‌మెంబెర్ దాము కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అనసూయమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.చివరిగా రెండు నిమిషాల మౌనం పాటించి కార్యక్రమాన్ని ముగించారు.

## వృద్ధుడిపై వీధి కుక్కల దాడి

### శరీరం నుండి వేరైనా చెవి, ముక్కు భాగాలు.... వృద్ధుడి పరిస్థితి విషమం

**మెట్రో న్యూస్, ఇబ్రహీంపట్నం:** వీధి కుక్కల ఆగడాలు రోజురోజుకు పెట్రేగిపోతున్నాయి. ఒక నిండు ప్రాణం ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరగూడ గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారం మరోసారి ప్రమాదకర ఘటనకు దారితీసింది.



గ్రామానికి చెందిన ఎన్ను జయపాల్ రెడ్డి (75) పై మంగళవారం తెల్లవారు జామున వీధి కుక్కలు దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయాల నుండి తీవ్ర రక్తస్రావం కావడంతో డాక్టర్లు 48 గంటలు గడిస్తే గానీ ఏమి చెప్పలేమని చేతులెత్తేశారు.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం తెల్లవారు జామున తన ఇంటి బయట జయపాల్ రెడ్డి పై ఒక్క సారిగా కుక్కల గుంపు దాడి చేయడంతో ఆయన కింద పడిపోయి తీవ్ర గాయాలపలై, తీవ్ర రక్తస్రావం జరుగు తుండగా,వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. స్థానిక అధికారులు స్పందించకపోవడం జరుగుతుందని, వెంటనే తగు చర్యలు తీసుకోకుంటే తాము కలెక్టరేట్ ఎదుట బయయించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

## భవిష్యత్తులో గొప్ప చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు బద్రీనాథ్ గుప్తా ఇంటర్మీడియట్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బోడకొండ విద్యార్థికి ఘనంగా సన్మానం మెట్రోన్యూస్,మంచాల: రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బోడకొండ గ్రామానికి చెందిన నిత్యం వ్యవసాయం చేసే రైతు జాటోత్ శ్రీను ఆయన కూమరుడు జీవన్ కుమార్ ఇంటర్మీడియట్లో 1000/989 మార్కులు సాధించి మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు వనపర్తి బద్రినాథ్ గుప్తా గ్రామ సర్పంచ్ చందర్ ఉపసర్పంచ్ రవి నాయక్ గ్రామ శాఖ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ మాజీ వార్డు సభ్యులు రమేష్ జహవర్,తావు నాయక్, కిట్టులతో కలిసి జీవన్ కుమార్ ను అభినందించి, ఘనంగా సన్మానించారు.ఈ సం



దర్భంగా బిఆర్ఎస్ యువజన విభాగధ్యక్షుడు బద్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి మండల స్థాయిలో అచ్యుతము మార్గం తెచ్చుకొని, తమ గ్రామానికి మంచి పేరు తెచ్చాడని, భవిష్యత్తులో మరిన్ని గొప్ప చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు చేయాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. జీవన్ కుమార్కు తాము ఎల్లప్పుడూ అండగా ఉండి, తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## త్వరలోనే ప్రెస్ క్లబ్ నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం..

- యూనియన్లకు అతీతంగా ఉమ్మడి ప్రెస్ క్లబ్ నిర్మాణం
- అందరికీ అందుబాటులోకి సభ్యత్వనమోదు కార్యక్రమం
- బాధ్యతలు స్వీకరించిన 12 మంది బృందం దిశానిర్దేశం చేసిన రాష్ట్ర నాయకులు ఆస్కాని మారుతి సాగర్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 15, మెట్రో న్యూస్ ప్రతినిధి:** కొన్ని కారణాల వలన అర్ధాంతరంగా నిర్మాణ దశలో ఆగిపోయిన ప్రెస్ క్లబ్ భవనాన్ని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కానీ మారుతి సాగర్ తెలి పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నిర్మాణ,నిర్వహణ కమిటీని యూనియన్లకు అతీతం గా బుధవారం సూరారం ప్రెస్ క్లబ్ లో



జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా అస్కాని మారుతిసాగర్, గడ్డమీది బాల్ రాజ్ , తన్నీరు శ్రీనివాస్, సభ్యులుగా గుంటూరు శేఖర్, రంగు వెంకటేష్ గౌడ్, జగదీష్, కసుకుర్తి వెంకట్, కోలేపాక వెంకట్, జి. అశోక్, గోలిపల్లి దయాకర్ రెడ్డి, సుగ్రీవుడు ముదిరాజ్, రెడ్డెబోయిన మల్లేష్ యాదవ్, మాధవరెడ్డి, శివ, గోవిందరావు లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రెస్ క్లబ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్లకు సంబంధించిన సుమారు 100కి పైగా పాత్రికేయులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ సభ్యులుగా బాలరాజు

**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ సభ్యులుగా టియుడబ్ల్యూజె అధ్యక్షులు గడ్డమీది బాలరాజు నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ పంపిన ప్రతిపాదనల మేరకు సమాచార శాఖ కమీషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా స్ఫూర్తి ఎడిటర్‌గా పని చేస్తున్న ఆయన జిల్లాలో చిన్న పత్రికల ప్రతినిధిగా సేవలు అందిస్తున్నారు. ఆయనతోపాటు యూనియన్ ప్రతినిధులుగా మోతె వెంకట్ రెడ్డి, రామారావు, బిగ్ పేపర్ ప్రతినిధిగా సునీల్, మీడియం పేపర్ ప్రతినిధిగా దిశ రవి, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులుగా ప్రసాద్, భూపాల్‌లు నియమితులయ్యారు. త్వరలోనే సమావేశం నిర్వహించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిషన్‌లు మంజూరయ్యేలా చూస్తామని వారు తెలిపారు.



## అవినీతి, అక్రమాలు ఇక్కడ సర్వసాధారణం

- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న బడంగ్పేట్ టౌన్ ప్లానింగ్ సర్కిల్ అధికారులు...
- ఓ వైపు ఏ.సి.బి.. దాడులు, విజిలెన్స్ విచారణలు అధికారుల సస్పెండ్ ..
- అక్రమ, నిర్మాణాలపై అధికారుల చర్యలు శూన్యం

**మెట్రోన్యూస్, బడంగ్పేట్ :** బడంగ్పేట్ సర్కిల్‌లో అవినీతి, అక్రమాలు అన్ని, ఇన్ని కావు ఇక్కడ అవినీతి రాజ్యం ఏలుతుంది. ఇక్కడ అవినీతి , అక్రమాలపై మీడియాలో వార్త కథనాలు రాని రోజు అంటూ లేదు... పలు ఆరోపణల నేపథ్యంలో ఏ.సి.బి, దాడులు జరిగాయి.. అనంతరం విజిలెన్స్ విచారణ జరిగింది.. విచారణలో అవినీతి అక్రమాలు బయట పడటంతో...కమిషనర్ తో సహా పలువురు సిబ్బంది సస్పెండ్ అయినా అధికారుల పనితీరులో ఏ మాత్రం మారడం లేదు.. బడంగ్పేట్ సర్కిల్ లో ఎన్నో అక్రమ నిర్మాణాలు... అక్రమ నిర్మాణాలపై మీడియాలో ఎన్నో కథనాలు.. మీడియాలో వార్త కథనాలు అంటూ లైట్‌తీసుకుంటున్నారు.




టౌన్ ప్లానింగ్ అధికారులు...బడంగ్పేట్ సర్కిల్ పరిధిలోని సర్వే నెంబర్ 134/బి .. ప్లాట్ నెంబర్ 3.. నిర్మాణ దారులు డొమెస్టిక్ అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనం నిర్మిస్తున్నారు.... ఈ అక్రమ నిర్మాణం పై మెట్రో దిన పత్రికలో పూర్తి కథనం ప్రచురించడం జరిగింది... అయినా అధికారులు అక్రమ నిర్మాణం పై ఏలాంటి చర్యలు తీసుకోలేదు... అధికారుల మౌనం వెనుక అంతర్యం ఏమిటి... అక్రమ నిర్మాణాలను ప్రోత్స



హిస్తున్నది ఎవరు... జోనల్ కమిషనర్ బడంగ్పేట్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి.. చట్ట పరమైన చర్యలు తీసుకొని... అక్రమ కట్టడాలను అరికట్టి తమ నిబద్ధతను చాటుకుంటారో లేదా మరో కథనంతో మీ ముందుకు....




# చంద్రగిరిలో క్రీడా వికాస కేంద్రం

## లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం




తిరుపతి జిల్లా చంద్రగిరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, దివంగత నారా రామ్మూర్తినాయుడు స్మారకార్థం నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ కేవలం అతిథిగా మాత్రమే కాకుండా, స్వయంగా క్రీడాకారుల మధ్యకు వెళ్లి సందడి చేశారు. ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన కాసేపు బ్యాడ్మింటన్ ఆడారు. అలాగే చిన్నారులతో కలిసి టేబుల్ టెన్నిస్, హాకీ ఆడుతూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.



# టీడీపీ పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రక్షాళన


తెలుగుదేశం పార్టీలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంత్రి నారా లోకేష్ ఎంపికయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనసాగుతున్నారు. బుధవారం పార్టీ కమిటీలను ప్రకటన చేస్తూ... పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను నియమించారు. టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కూడా కొనసాగనున్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది.

సీనియర్లకు గౌరవం... కొత్తవారికి అవకాశాలు...సామాజిక కోణం కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి పదవులు కేటాయించారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించారు. ఇక పొలిట్ బ్యూరో విషయానికొస్తే అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జ్ గుత్తికొండ ధనుంజయ్‌లు చోటు దక్కించుకోవడం విశేషం.

29 మందితో పొలిట్ బ్యూరో ఏర్పాటు చేశారు. 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీలు ఏర్పడ్డాయి. జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10 ఉంటారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్ల-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77 ఉండనున్నారు. నాలెడ్జి కమిటీ, హెచ్‌ఆర్డీ కమిటీల్లో ఒక్కొరి చొప్పున నియామకం జరిగింది. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం లభించింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు... అన్ని కోణాల్లో విశ్లేషించి కమిటీల కూర్పు చేపట్టినట్టు చెబుతున్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఫోకస్

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. బుధవారం నాడు పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం-నలమల్ల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జల ధార, జల హారతి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.నినిట్విన్ టన్నెల్స్ లైనింగ్ పనులు 77 శాతం, అప్రోచ్ చానల్ ఎర్త్ వర్క్ పనులు 98 శాతం, హెడ్ రెగ్యులేటర్ కాంక్రీట్ పనులు 71 శాతం, ఇరిగేషన్ టన్నెల్ లైనింగ్ 76 శాతం పూర్తైనట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కేఎల్ బండ్ ఎర్త్ వర్క్, ఎంబార్క్‌మెంట్ పనులు ఈ ఏడాది జూన్ కల్లా పూర్తి చేస్తామన్నారు. ఆర్అండ్ఆర్‌కి సంబంధించి 49 కాలనీలు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి, మరో 20 కాలనీలు 2027 ఏప్రిల్ కల్లా పూర్తి చేయనున్నట్టు తెలిపారు. నినిమొదటి దశలో మొత్తం 38,060 నిర్వాసిత కుటుంబాలకుగాను, ఇప్పటివరకు 16,763 కుటుంబాల తరలించినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఏడాది ఆగస్ట్ నాటికి 8,518 కుటుంబాలు, 2027 ఏప్రిల్‌కు 12,779 కుటుంబాలు తరలించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.27,089 కోట్లు వ్యయం అయినట్టు అధికారులు వెల్లడించగా... మరో రూ.5,108 కోట్లతో సివిల్, ఆర్అండ్ఆర్ పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలిచ్చారు. మొత్తం వెలిగొండ పనులు జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు.




# జువ్వలదిన్నె హార్బర్‌లో జగన్ పర్యటన



**మత్స్యకారులతో ముఖాముఖి చర్చలు**
హార్బర్ పర్యటనలో భాగంగా జగన్ స్థానిక మత్స్యకారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వేట సమయంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, వసతుల కొరతను మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను సావధానంగా విన్న జగన్, మత్స్యకార కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలపై ఆరా**
మత్స్యకారుల సంక్షేమం కోసం అమలవుతున్న పథకాలు, వాటి ద్వారా అందుతున్న లబ్ధిపై జగన్ వివరాలు సేకరించారు. హార్బర్ నిర్వహణ మరియు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనతో స్థానిక మత్స్యకారులలో కొత్త ఉత్సాహం నెలకొంది మరియు తమ సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



# 63 మందికి ఇళ్ల పట్టాలు

## పాతికేళ్ల కల నెరవేరిన వేళ

జై భీమ్ నగర్ పేరుతో కొత్త ఆశల పల్లకి పట్టాల పంపిణీ జరిగిన ప్రాంతానికి జై భీమ్ నగర్ అని నామకరణం చేసి పేదలకు అంకితం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆసక్తి చూపడం వల్లే ఈ అసాధ్యమైన పని సుసాధ్యమైందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి నిరుపేదకూ సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆమె ఉద్ఘాటించారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారికి కూడా త్వరలోనే పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.



ముదివర్తి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట గ్రామంలో కేవలం పట్టాల పంపిణీ మాత్రమే కాకుండా గడిచిన 22 నెలల్లో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. సుమారు 2 కోట్ల 29 లక్షల రూపాయలతో సాగు కాలువల పూడికతీత మరియు విద్యుత్ లైన్ల అప్‌గ్రేడ్ వంటి పనులు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి అడ్డంకులను తొలగించడం వల్లే ఈ పట్టాల పంపిణీ సాధ్యమైందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కొనియాడారు. అటు సంక్షేమం ఇటు అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని ప్రజాప్రతినిధులు ఈ సభా వేదిక ద్వారా స్పష్టం చేశారు.

# కదిరిలో భారీ పేలుడు

ప్రమాదం జరిగిన తొలినాళ్లలో గ్యాస్ సిలిండర్ పేలుడు వల్లనే ఈ ఘటన జరిగిందని అందరూ భావించారు. అయితే, పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో జరిపిన తనిఖీల్లో కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ధ్వంసమైన ఇంటి శిథిలాల మధ్య పేలుడు పదార్థాలను అమర్చడానికి ఉపయోగించే డ్రిల్లింగ్ మిషన్‌ను పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ప్రమాదం గ్యాస్ సిలిండర్ వల్ల జరిగింది కాదని, ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన డిటోనేటర్లే కారణమని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు.




అక్రమ నిల్వలపై బాంబ్ స్క్వాడ్ ఆరా జనావాసాల మధ్య అంత భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను ఎందుకు నిల్వ చేశారు? అసలు ఆ ఇంట్లో డ్రిల్లింగ్ మిషన్ అవసరం ఏముంది? అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. బాంబ్ స్క్వాడ్ కూడా ఘటనాస్థలిని పరిశీలించి, శాంపిళ్లను సేకరించింది. ఈ అక్రమ పేలుడు పదార్థాల నిల్వలకు బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది.

# చేపల వేటపై 61 రోజులు నిషేధం

ప్రతి ఏటా వేసవి కాలంలో చేపలు, ఇతర సముద్ర జీవులు సంతానోత్పత్తి చేస్తాయి. ఈ కీలక సమయంలో యాంత్రిక పడవలతో వేట సాగిస్తే మత్స్య సంపద అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సముద్ర పర్యావరణాన్ని కాపాడటానికి రాష్ట్ర మత్స్యశాఖ ఈ 61 రోజుల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఈ నిబంధనలు రాష్ట్రంలోని అన్ని రకాల మోటారు బోట్లకు వర్తిస్తాయి. కేవలం సంప్రదాయ పడవల ద్వారా తీరానికి సమీపంలో వేట సాగించే వారికి మాత్రమే మినహాయింపు ఉంటుంది. వేట విరామ సమయంలో నిబంధనలు అతిక్రమించి సముద్రంలోకి వెళ్లే వారిపై మత్స్యశాఖ కఠినంగా వ్యవహరించనుంది.





# ఎండ ప్రచండం


భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్లో వేసవి సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 40.5-42.5 డిగ్రీల వరకు తెలంగాణలో 41.5 నుంచి 43.5 డిగ్రీల వరకునమోదవుతున్నాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతు న్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఇప్పుడు మీద పడనున్న ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది. దానికితోడు అత్యల్ప వర్షపా తం కూడా రేపటి వ్యవసాయ కార్యాచరణపై ప్రభావం చూపుతుంది. భారత్లోకి వచ్చే మొత్తం వర్షపాతం సుమా రు 75 శాతం వస్తుంది. ఈసారి నైరుతి రుతుపవనాల ప్రభావం వ్యవసాయ దారులను ఇబ్బందులకు గురిచేసే టట్లుగా ఉండచ్చు.



# భక్తుల పట్ల మర్యాదగా మెలగండి

**ఇఓ వి.కె. శీనానాయక్**

పవిత్ర ఇంద్రకీలాద్రి క్షేణానికి విచ్చేసే భక్తుల పట్ల సెక్యూరిటీ సిబ్బంది అత్యంత గౌరవంగా, ఆప్యాయతతో వ్యవహరించాలని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇఓ వి.కె. శీనానాయక్ స్పష్టం చేశారు. మంగళవారం మహానుండనం 4వ అంతస్తులో దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందితో జరిగిన సమావేశంలో భక్తుల భద్రత, ప్రవర్తనా నియమావళి, సేవా దృక్పథంపై ఆయన దిశానిర్దేశం చేస్తూ ఆధ్యాత్మిక క్షేత్రంలో సెక్యూరిటీ విధులు కేవలం కావరా కావడం మాత్రమే కాదని, అది ఒక పవిత్రమైన సేవా కార్యక్రమమని ఎన్నో ఆశలతో, బాధలతో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులతో మర్యాదగా మాట్లాడాలి ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ, ఆప్యాయత చూపినప్పుడే దేవస్థానానికి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఈవో పేర్కొన్నారు.



# ఇంటర్ ఫలితాల్లో మెరిసిన ఎన్టీఆర్ ట్రస్ట్




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలంగాణ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ ఇంటర్మీయేట్ ఎడ్యుకేషన్ నిర్వహించిన పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎన్టీఆర్ మహిళా జూనియర్, డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు నా అభినందనలు. అన్ని విభాగాల నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు అత్యధిక మార్కులు, టాప్ ర్యాంకులతో ప్రతిభ కనబరచడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. సీనియర్ ఎంపీసీ నుంచి 2, 3 రాష్ట్ర ర్యాంకులతో పాటు జూనియర్ ఎంపీసీలో 10 మంది విద్యార్థులు, జూనియర్ బైపీసీలో 11 మంది విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు వచ్చాయి.

అలాగే జూనియర్ ఎంఈసీలో 3, 4 ర్యాంకులు, జూనియర్ సీఈసీలో 5వ ర్యాంకు ఎన్టీఆర్ మహిళా జూనియర్, డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు రావడం గర్వకారణం. ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న అత్యున్నత సేవలకు దక్కిన ఫలితం ఇది. దీనికి కారణమైన ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వాహకులకు, కళాశాల బోధనా సిబ్బందికి, ఉద్యోగులకు మనస్ఫూర్తిగా అభినందనలు ఇదే ఉత్సాహం, ఇదే సేవా స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నాను అని ట్వీట్ చేసారు.

# రోహిత్ శర్మ గాయంపై తాజా అప్డేట్..!



ముంబయి ఇండియన్స్ అభిమానులకు గుడ్ న్యూస్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో భారీ లక్ష్య ఛేదన చేస్తుండగా ముంబయి ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. దీంతో 241 పరుగుల ఛేదనలో ముంబయి 222 పరుగులకే పరిమితమైంది. అప్పటికి రోహిత్ 13 బంతుల్లో 19 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రోహిత్ గాయంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. అయితే, అతడికి సంబంధించి మెడికల్ రిపోర్ట్ వచ్చేసింది. కండరాలు పట్టేయడంతో మైదానం వీడిన అతడు.. స్కానింగ్ తీయించుకున్న సంగతి తెలిసిందే. ఆ రిపోర్ట్ ప్రకారం ఎలాంటి చీలిక లేదని తేలింది. దీంతో ముంబయి ఇండియన్స్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, పంజాబ్లో గురువారం మ్యాచ్ లో ఆడతాడో? లేదో అనేది ఇంకా అనిశ్చితిగానే ఉంది. గాయం మరీ పెద్దది కాకపోవడంతో తొలుత అనుకున్నట్లు మరిన్ని మ్యాచులకు మాత్రం దూరమయ్యే అవకాశం లేదు. ఇవాళ సాయంత్రానికి ఫిట్నెస్పై స్పష్టత రానుంది.

కండరాలు పట్టేయడంతో రోహిత్ మైదానం వీడాడు. అయితే, స్కానింగ్లో ఎలాంటి గాయం కనిపించలేదు. దీంతో మరిన్ని మ్యాచులకు దూరం అవుతాడనే ఊహాగానాలకు తెరపడినట్లే. అయితే, గురువారం పంజాబ్లో రోహిత్ను బరిలోకి దింపుతారా? లేదా? అనేది మేనేజ్మెంట్ చేతుల్లోనే ఉంది. ఓపెనర్గా మంచి ఫామ్లో ఉన్న రోహిత్ సేవలు జట్టుకు అవసరమే. కనీసం అతడిని ఇంపాక్ట్ ప్లేయర్గానైనా బరిలోకి దింపే అవకాశం లేకపోలేదు అని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఎల్లో ఒక ఫ్రాంచైజీ తరపున 6వేల పరుగులు చేసిన బ్యాటర్గా రోహిత్ నిలిచాడు.

ప్రతి మ్యాచూ కీలకం.. ఈ సీజన్లో ముంబయి నాలుగు మ్యాచుల్లో ఒకేఒక్క విజయాన్ని మాత్రమే నమోదు చేసింది. ప్లేఆఫ్స్కు చేరుకోవాలంటే ఇకనుంచి ప్రతి మ్యాచ్లోనూ గెలవాల్సిందే. మరోవైపు బ్యాటింగ్ ఫర్వాలేదనిపిస్తోన్న ముంబయి.. బౌలింగ్లో లో మాత్రం తేలిపోతోంది. స్టార్ పేసర్లు బుమ్రా, బౌల్ట్ ఏమాత్రం ప్రభావం చూపించడం లేదు. ప్రత్యర్థిని కట్టడి చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నారు.

# స్టేడియంలో ఖరీదైన వస్తువు పోగొట్టుకున్న యువతి



స్టేడియం గ్యాలరీలో కూర్చుని మ్యాచ్ చూస్తున్న ఒక యువతి, తన సోషల్ మీడియా ఫాలోవర్ల కోసం ఒక వెరైటీ రీల్ తీయాలని నిర్ణయించుకుంది. తన వేలికి ఉన్న ఖరీదైన ఉంగరాన్ని కెమెరాకు చూపిస్తూ వీడియో తీస్తుండగా, ఒక్కసారిగా ఆ ఉంగరం వేలి నుంచి జారి గ్యాలరీ కింద పడిపోయింది. ఆ ఉంగరం విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని సమాచారం.

వెతికినా దొరకని ఉంగరం ఉంగరం కింద పడగానే ఆ యువతి తీవ్ర ది(గ్భ్రాంతికి గురైంది. స్టేడియంలో ఉన్న విపరీతమైన రద్దీ కారణంగా ఆ ఉంగరాన్ని వెతకడం అసాధ్యంగా మారింది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆ యువతి అక్కడే కన్నీటి పర్యంతమైంది. ఆమె పడ్డ ఆవేదన అంతా కెమెరాలో రికార్డు అవ్వగా, ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# నా శరీరంలో ఇప్పటికీ ఆ అవశేషాలు కుమార సంగక్కర



ఏళ్లు గడిచినా.. ఆ దాడి తాలూకా జ్ఞాపకాలు మాత్రం ప్లేయర్లను వదలడం లేదు. 2009లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక ప్లేయర్ల బస్సై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో శ్రీలంక ప్లేయర్లూ ఉన్నారు. అప్పట్నుంచి కొన్ని సంవత్సరాలు పాకిస్థాన్లో ఆడేందుకు కొన్ని జట్లు విముఖత చూపించాయి. తటస్థ వేదిక పైనే ఆడాల్సిన పరిస్థితి పాక్కు ఎదురైంది. ఉగ్రదాడిలో కుమార సంగక్కర, అజంత మెండిస్, తిరంగ, సురంగ, తిలాన్ సమరవీర, తుషారా గాయపడ్డారు. ఆ ఘటనపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో కుమార మాట్లాడాడు. ఇప్పటికీ తన శరీరంలో ఆ ప్రమాదానికి సంబంధించి బాంబు అవశేషాలు ఉన్నట్లు వెల్లడించాడు.

ఆ రోజు (మార్చి 3, 2009) పాక్-శ్రీలంక జట్ల మధ్య టెస్టు థర్డ్ డే. హోటల్ నుంచి గ్రౌండు వెళ్లాలని సిద్ధమయ్యాం. మా జట్టులోని ఓ ఫాస్ట్ బౌలర్ ఈ ఫ్లాట్ ట్రాక్ దెబ్బకు మా బ్యాక్ బ్రేక్ అవుతోంది. ఎక్కడైనా బాంబు పడి.. మ్యాచ్ రద్దు అయితే బాగుండు ఇంటికి వెళ్లిపోవచ్చు అన్నాడు. ఆ మాట ముగిసిన మరుక్షణమే మేం దాడికి గురయ్యాం. మేమంతా గాయపడ్డాం. ఇప్పటికీ నా శరీరంలో ఆ శకలాలు ఉంటాయి. అప్పటివరకూ ఇలాంటివి ఎప్పుడూ నాకు ఎదురుకాలేదు. కానీ, శ్రీలంకలో ఏం జరుగుతుందోననే ఆందోళన కలిగింది. అప్పుడు ఏదో యుద్ధం జరుగుతోంది. అలాంటి సమయంలో వెళ్లాం. రెండు నిమిషాలు మా పై దాడి జరిగింది. ఒక్కసారిగా హెడ్లైన్లలో ఎక్కేశాం అని గుర్తు చేసుకున్నాడు. వారు రోజూ చూస్తారు..

ఆ ఘటన జరిగిన చాలా రోజుల తర్వాత కొలంబోలో నేను కార్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్తుంటే.. ఓ ఆర్మీ ఆఫీసర్ అనుకుంటా నన్ను ఆపారు. ఎలా ఉన్నారు? అంటూ అడిగారు. నేను బాగానే ఉన్నానని చెప్పా. మేం ఆ ఘటన జరిగినట్లు వార్తల్లో చూశాం. ది(గ్భ్రాంతికి గురయ్యాం అని అన్నారు. నేను స్పందిస్తూ మీలాంటి సైనికులకు ఇలాంటివి ఎప్పుడూ జరుగుతూనే ఉండటం మేం చూస్తుంటాం అని బదులిచ్చా. అందుకోసమేగా మేం స్వచ్ఛందంగా ఆర్మీలో చేరతాం అని సమాధానం ఇచ్చారు. మనం జీవిస్తోన్న ప్రపంచం తీరు అప్పుడు అర్థమైంది. మ్యాచ్లు ఆడితే బాగానే జీతం వస్తుంది. దాదాపు పాతికేళ్లపాటు సైనికులు అనుభవిస్తోన్న ఓ పరిస్థితిని కేవలం రెండు నిమిషాలపాటు ఎదుర్కొంటేనే మేం హీరోలుగా మారిపోయాం" అని సంగక్కర తెలిపాడు.

# సూర్య భవితవ్యంపై చర్చ

కెప్టెన్గా టీ20 ప్రపంచకప్లో లో టీమ్ ఇండియాను విజయపథంలో నడిపించినప్పటికీ బ్యాటుతో పేలవ ప్రదర్శన చేస్తున్న నేపథ్యంలో సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్కు అతడు జట్టు ప్రణాళికల్లో ఉంటాడా లేదా అన్న చర్చ మొదలైంది. ఈ పరిస్థితుల్లో జూన్-జులైలో ఇంగ్లాండ్, ఐర్లాండ్లతో భారత పర్యటన సూర్యకు చాలా కీలకం కానుంది. కెప్టెన్సీ కన్నా అతడి బ్యాటింగ్పై సెలక్టర్లు ఎక్కువ దృష్టి పెడతారనడంలో సందేహం లేదు. మరో రెండేళ్లు అతడికి అవకాశం దక్కుతుందా లేదా అన్నది ఈ పర్యటన నిర్ణయించనుంది. ఈ రెండేళ్లలో భారత్.. లాస్ఏంజెలెస్ ఒలింపిక్స్, టీ20 ప్రపంచకప్ (2028)లు ఆడనుంది. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ సమయానికి సూర్య 38వ ఏట ఉంటాడు. సూర్య జట్టును నడిపిస్తున్నాడు. కానీ అతడు బ్యాటుతోనూ రాణించాలి. నిలకడైన ప్రదర్శన చేయాలి. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో అతడే కెప్టెన్గా ఉంటాడు. కానీ ఆ తర్వాత 2028 వరకు అతణ్ని కొనసాగించాలా లేదా అన్నది పూర్తిగా ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. రెండేళ్లుగా సూర్య పెద్దగా ఫామ్లో లేడు.




# పదేళ్లకే పెళ్లి ఇప్పుడు పవర్ లిఫ్టర్

**బాల్య వివాహం..**

అడుగడుగునా అండగా నిలబడాల్సిన అమ్మానాన్నలే మనకు ఎదురు తిరిగితే.. మన ఇష్టాయిష్టాలు, అభిరుచులకు అడ్డుపడితే ఎంత బాధగా ఉంటుందో కదూ! ఆ వేదనను భరించలేం.. ఎవరితోనూ పంచుకోలేం. సరిగ్గా పదేళ్ల వయసులో ఇలాంటి మానసిక క్షోభనే అనుభవించానంటోంది దుర్గ.

మాది రాజస్థాన్లోని ఓ మారుమూల గ్రామం. నేను నిరుపేద కుటుంబంలో పుట్టా మా నాన్న సెక్యూరిటీ గార్డ్, అమ్మ చిన్న చిన్న పనులు చేస్తూ ఇంటిని పోషించే వారు. మేం ఆరుగురం తోబుట్టువులం. చిన్నప్పట్నుంచి బాగా చదువుకోవాలి.. మంచి ఉద్యోగం తెచ్చుకోవాలి... అమ్మానాన్నల్ని బాగా చూసుకోవాలి.. అనుకునే వాళ్లం. కానీ బాల్య వివాహం నా కలల్ని కల్లలు చేసింది. మా ఊర్లో ఆటా-సాటా అనే సంప్రదాయం ఉండేది. ఇందులో భాగంగా.. ఇంట్లో అబ్బాయి పెళ్లి కుదిరితే.. అతడికి కాబోయే భార్య సోదరుడికి.. ఆ అబ్బాయి సోదరిని ఇచ్చి వివాహం చేస్తారు. అంటే వధువుల్ని ఇచ్చిపుచ్చుకుంటారన్నమాట! నాకు పదేళ్లున్నప్పుడు నా సోదరుడికి పెళ్లి కుదిరింది. దాంతో బలవంతంగా నాకూ పెళ్లి చేశారు. అలా వివాహమంటే ఏంటో తెలియని ఆ పసి వయసులోనే అత్తారింట్లో అడుగుపెట్టా.




**పనిమనిషిలా చూశారు!**

అక్కడికెళ్లాక నా పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. స్కూల్ మాన్పించేశారు.. పరదా మాటునే ఉండాలన్నారు.. వంట చేయడం, ఇంటి బాధ్యతలు చూసుకోవడం, వ్యవసాయ పనుల్లో సహాయం చేయడం.. ఇవే నా జీవితమన్నారు. ఆ ఇంట్లో ఓ కోడలిగా కాదు.. పని మనిషిగా బతకాల్సి వచ్చింది. నేను పుట్టింటికి వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక సాకు చెప్పి వెంటనే నన్ను తిరిగి పిలిపించుకునే వారు. ఇలాంటి ఆంక్షల చట్రంలో మగ్గడం నా వల్ల కాలేదు. అయితే ఓరోజు మా పుట్టింటి నుంచి నాకు ఫోన్ కాల్ వచ్చింది. మా నాన్నకు క్యాన్సర్ సోకిందని తెలిసింది. దాంతో నాన్నను చూసుకోవడానికి పుట్టింటికి వెళ్లా. ఆ తర్వాత ఇంకెప్పుడూ అత్తారింటి గడప తొక్కలేదు. మా అమ్మానాన్నల్ని పోషించాల్సిన సమయం ఇదే అనిపించింది. అందుకే కుటుంబ పోషణ, నాన్న క్యాన్సర్ చికిత్స కోసం డబ్బు సంపాదించడానికి చిరు ఉద్యోగాలు చేశా. కొన్నిసార్లు కూలి పనులూ చేయాల్సి వచ్చేది. దీంతో నా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడింది. కోలుకునేందుకు వ్యాయామం చేయమని వైద్యులు సూచించారు. అలా తొలిసారి జిమ్లో అడుగుపెట్టా.

**ట్రైనర్ సలహాతో..!**

ఎందుకో తెలియదు కానీ జిమ్ వాతావరణం నాకెంతో నచ్చింది. ఇన్స్ట్రక్టర్ సలహాతో విభిన్న వ్యాయామాలు సాధన చేశా. బరువులెత్తడం, పవర్ లిఫ్టింగ్ కూడా ప్రాక్టీస్ చేశా. ఇది చూసి ఒక రోజు నా ట్రైనర్ 'నీకు పవర్ లిఫ్టింగ్లో మంచి పట్టుంది. ప్రయత్నిస్తే ఇందులో రాణించగలవు' అంటూ ప్రోత్సహించారు. ఆ మాటలే నా జీవితాన్ని మలుపు తిప్పాయి. ఇందులో పూర్తి నైపుణ్యాలు సాధించి.. మొదటిసారిగా జిల్లా స్థాయి పోటీలో పాల్గొన్నా. బంగారు పతకం గెలుచుకున్నా. దాంతో నా ఆనందానికి హద్దు లేకుండా పోయింది. ఇదే ఆత్మవిశ్వాసంతో జిల్లా స్థాయిలో మరిన్ని పోటీల్లో పాల్గొన్నా. పలు పతకాలూ సాధించా. ఆపై రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం వచ్చింది. దాంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఓ పోటీలో రజతంతో పాటు మరో రికార్డూ నా సొంతమైంది. ఇలా నేను క్రీడల్లో రాణించడం చూసి మా అత్తింటి వారు నన్ను తిరిగి తీసుకెళ్లాలని ప్రయత్నించారు. కానీ నా ఆటను, కెరీర్ను వదులుకోనని నేను తేల్చి చెప్పడంతో అందుకు వారు ససేమిరా అన్నారు. అక్కడితో నా వైవాహిక బంధం ముగిసింది. ప్రస్తుతం ఓవైపు పవర్లిఫ్టింగ్లో రాణిస్తూనే.. మరోవైపు ప్రభుత్వోద్యోగ ప్రయత్నాలూ చేస్తున్నా.. నా తల్లిదండ్రుల బాధ్యతలూ చూసుకుంటున్నా. ఒకప్పుడు నన్ను చిన్నచూపు చూసిన వారే ఇప్పుడు ప్రశంసిస్తుంటే గర్వంగా అనిపిస్తోంది..ః అంటూ తన కథను పంచుకుంది దుర్గ.



**మనసు మాట వినండి!**

ప్రస్తుతం జాతీయ స్థాయిలో సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ దేశానికి పతకాలు తెచ్చిపెడుతోన్న దుర్గ.. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడమే తన లక్ష్యమంటోంది. ఇక మరోవైపు ఇన్స్టాలోనూ చురుగ్గా ఉండే ఈ క్రీడాకారిణి.. తోటి అమ్మాయిల్లో స్ఫూర్తి నింపేలా పోస్టులు పెడుతుంటుంది.

జీవితంలో నాకెదురైన సవాళ్లను జయించడానికి నేనెంతో కష్టపడ్డా.. ఇతరుల ఆలోచనల్ని పక్కన పెట్టి నా మనసు చెప్పిందే విన్నా.. అందుకే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నా. పోరాటమే నా గుర్తింపు.. క్రీడలే నా బలం.. అందుకే పవర్లిఫ్టింగ్ని ఎప్పుడూ విడిచిపెట్టను.. అంటోన్న దుర్గ.. ఆకాశమే హద్దుగా సాగిపోవాలని ఈతరం అమ్మాయిలకు సూచిస్తోంది. ఇలా తన జీవితంలోని సవాళ్లకు ఎదురొడ్డి.. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా జీవితాన్ని మలచుకున్న దుర్గ కథ ఎంతోమందికి స్ఫూర్తి అని చెప్పడంలో సందేహం లేదు.





# సపోటా తింటే షుగర్ పెరుగుతుందా?

ఈ రోజుల్లో మధుమేహం వేగంగా పెరుగుతున్న సమస్యగా మారింది. అందుకే సరైన ఆహారం ఎంచుకోవడం చాలా ముఖ్యం. సపోటా రుచికరమైనదే కాకుండా పోషకాలు సమృద్ధిగా ఉన్న పండు. ఇందులో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అయితే, ఇది సహజంగా తీపిగా ఉండటం వల్ల మధుమేహంతో బాధపడేవారు తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

అప్పుడప్పుడు మాత్రమే తినాలి నిపుణుల ప్రకారం, సపోటాలో సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో త్వరగా గ్లూకోజ్గా మారి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే అవకాశం ఉంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా మధ్యస్థం నుంచి ఎక్కువగా ఉంటుంది. అయితే, ఇందులో ఉన్న ఫైబర్ జీర్ణక్రియను నెమ్మదిగా చేసి, చక్కెర శరీరంలోకి వెళ్లే వేగాన్ని కొంతవరకు తగ్గిస్తుంది. అందువల్ల, మధుమేహ రోగులు సపోటాను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కానీ చాలా తక్కువ పరిమాణంలో, అప్పుడప్పుడు మాత్రమే తినాలి. అలాగే ఎప్పుడు తింటున్నారు, ఎంత తింటున్నారు అన్నది చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరి శరీరం వేర్వేరు విధంగా స్పందిస్తుంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

మధుమేహం ఉన్నవారికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లు మంచివి. ఆపిల్, జామ, బేరి, బెర్రీలు వంటి పండ్లు చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తాయి. ఇవి రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా సహాయపడతాయి. బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్లు కూడా ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి ఉపయోగకరం.

జీవనశైలి కూడా ముఖ్యం మధుమేహ నియంత్రణకు కేవలం పండ్లు మాత్రమే కాదు, మొత్తం జీవనశైలి కూడా ముఖ్యం. సమతుల్య ఆహారం తీసుకోవడం, సమయానికి తినడం, రోజూ వ్యాయామం చేయడం చాలా అవసరం. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. సపోటా తినవచ్చు కానీ పరిమితంగా మాత్రమే తినడం మంచిది. మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి డాక్టర్ సలహా తీసుకుని తినడం ఉత్తమం.

# జుట్టు చివర్లు చిట్లిపోతున్నాయా

చాలామందికి జుట్టు రాలడం సమస్యగా ఉంటే, కొందరికి జుట్టు చివర్లు చిట్లిపోవడం పెద్ద ఇబ్బందిగా మారుతుంది. దీంతో జుట్టు బాగానే ఉన్నా చూడటానికి అందంగా కనిపించదు. చాలామంది దీని పరిష్కారం జుట్టు కత్తిరించడమే అనుకుంటారు. కానీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యను తగ్గించుకోవచ్చు.

జుట్టు చివర్లు చిట్లిపోవడాన్ని స్ప్లిట్ ఎండ్స్ అంటారు. జుట్టు పైపొర దెబ్బతినడంతో లోపలి భాగం బయటకు వచ్చి జుట్టు చీలిపోతుంది. ఒకసారి ఇలా చిట్లిపోతే, క్రీములు లేదా



సీరమ్లు పూర్తిగా దాన్ని సరిచేయలేవు. అవి తాత్కాలికంగా మాత్రమే మృదువుగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి చిట్లిన భాగాన్ని కత్తిరించడమే సరైన మార్గం.

ఎందుకు ఇలా జరుగుతుంది?

హీట్ స్టైలింగ్ పరికరాలు ఎక్కువగా వాడటం, హెయిర్ కలర్ లేదా రసాయన చికిత్సలు చేయడం, తడి జుట్టును గట్టిగా రుద్దడం, బలంగా దువ్వడం వంటి అలవాట్లు జుట్టు దెబ్బతినడానికి కారణం అవుతాయి. అదనంగా కాలుష్యం, ఎండ కూడా జుట్టును బలహీనపరుస్తాయి.

ఏం చేయాలి? సల్ఫేట్ లేని మృదువైన షాంపూ వాడండి. షాంపూ తర్వాత కండిషనర్ తప్పనిసరిగా వాడాలి. వారానికి ఒకసారి హెయిర్ మాస్క్ వేసుకుంటే జుట్టు మృదువుగా ఉంటుంది. తడి జుట్టును గట్టిగా రుద్దకుండా మెల్లగా ఆరబెట్టాలి. వెడల్పాటి పళ్ల దువ్వెనతో మెల్లగా దువ్వాలి. సీరమ్ లేదా లీవ్-ఇన్ కండిషనర్ వాడటం మంచిది.

జుట్టు సంరక్షణ కోసం చిట్కాలు: ప్రతి 6-8 వారాలకు ఒకసారి జుట్టు చివర్లు కత్తిరించాలి. హీట్ పరికరాలు వాడే ముందు హీట్ ప్రొటెక్టెంట్ వాడాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తల కప్పుకోవాలి. పోషకాహారం కూడా చాలా ముఖ్యం. ప్రోటీన్, ఐరన్, విటమిన్లు ఉన్న ఆహారం తీసుకోవాలి. ఎక్కువ నీళ్లు తాగాలి.

మెట్రో ఈవినింగ్స్ సినిమా

# మోళి నెక్స్ట్ మూవీ ఫిక్స్



ఈ సినిమాకు 'దొంగ నా కొడుకు' అనే మాస్ అండ్ ఫన్నీ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ టైటిల్ వినడానికి చాలా సరదాగా ఉండటంతో సోషల్ మీడియాలో దీనిపై రకరకాల మీమ్స్ వస్తున్నాయి. టైటిల్‌ను బట్టి చూస్తుంటే, ఇది మోళి శైలిలో సాగే ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్ అని స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో మోళి మార్క్ కామెడీతో పాటు కథాంశం కూడా చాలా కొత్తగా, వినూత్నంగా ఉండబోతోందని చిత్ర యూనిట్ సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ వంటి పెద్ద నిర్మాణ సంస్థలో మోళి హీరోగా చేస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

# షూట్ లతో చిరంజీవి బిజీ బిజీ




ఈ సినిమాలో చిరంజీవి రెండు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించబోతున్నారని సమాచారం. గతంలో బాబీ దర్శకత్వంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య'లో చిరు తన వింటేజ్ కామెడీ మరియు మాస్ యాక్షన్‌తో మెప్పించారు. అయితే ఈసారి దానికి మించి, ఒకటి క్లాస్ లుక్ మరియు మరొకటి పూర్తిస్థాయి మాస్ పాత్ర ఉండబోతున్నట్లు టాక్. ఈ రెండు పాత్రల మధ్య వ్యత్యాసం స్పష్టంగా ఉండాలనే ఉద్దేశంతోనే మేకర్స్ లుక్ టెస్టుల కోసం ఇంత సమయం వెచ్చిస్తున్నారు. ప్రీ-ప్రొడక్షన్ పనులు ఇప్పటికే చివరి దశకు చేరుకున్నాయి.

షూటింగ్ షెడ్యూల్ వరుస ఫోటో షూట్‌ల ద్వారా పాత్రల వేషధారణపై ఒక క్లారిటీ వచ్చిన వెంటనే, వచ్చే నెలలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. బాబీ ఇప్పటికే స్క్రిప్ట్ పనులను పూర్తి చేసి, షూటింగ్ షెడ్యూల్స్‌ను పక్కాగా ప్లాన్ చేశారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి తన మేకోవర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో, ఈసారి మెగాస్టార్ నుంచి ఒక విజువల్ ట్రీట్ గ్యారెంటీ అని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' ఫస్ట్ లుక్ అవుట్





ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే, ఇది ఒక కలర్‌ఫుల్ ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. వరుణ్ ధావన్ తన మార్క్ ఎనర్జీతో కనిపిస్తుండగా, మృణాల్, పూజాల గ్లామర్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. చాలా కాలం తర్వాత డేవిడ్ ధావన్ తన తనయుడు వరుణ్‌తో కలిసి చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో బాలీవుడ్ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి.

రిలీజ్ డేట్ టిప్స్ ఫిలిమ్స్ మరియు మాక్సిమిలియన్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మే 22న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సమ్మర్ కానుకగా వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

# పవన్ కళ్యాణ్ OG' పార్ట్-2 రెడీ




ఈ సీక్వెల్‌కు 'ఓజస్ గంభీర - ర్యాంపేజ్ బిగిన్స్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. టైటిల్‌లోనే ర్యాంపేజ్' అని ఉండటంతో పార్ట్-1ను మించి యాక్షన్ ఉంటుందని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.తెలుగు వార్తల సేవ నిర్మాణ సంస్థలు ఈ భారీ ప్రాజెక్టును పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మరియు పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయని తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం తన రాజకీయ మరియు ఇతర షూటింగ్ షెడ్యూల్స్ (Dates) తో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఆయన ఇచ్చే కాల్ షీట్స్ బట్టి ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. సుజిత్ దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.



# జక్కన్న ఆ విషయంలో వెనుకపడ్డాడా

జూలైలో జరగబోయే కామికాన్ ఈవెంట్‌లో 'రామాయణం' టీజర్‌ను విడుదల చేసి అంతర్జాతీయ స్థాయిలో హైప్ క్రియేట్ చేయాలని బాలీవుడ్ మేకర్స్ సిద్ధమవుతున్నారు. రాజమౌళికి ఇప్పటికే ఆస్కార్ వంటి అంతర్జాతీయ గుర్తింపు ఉన్న నేపథ్యంలో, ఆయన ఎందుకు దూకుడు ప్రదర్శించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజానికి 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఇంకా తగినంత సమయం ఉండటంతో, విజువల్ ఎఫెక్ట్స్ మరియు టెక్నికల్ అంశాలపై ఆయన పూర్తి దృష్టి పెట్టారు. సినిమా అవుట్‌పుట్ పట్ల పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే తన బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీయాలనేది రాజమౌళి మాస్టర్ ప్లాన్.

మహేష్ క్రేజ్.. రాజమౌళి నమ్మకం రాజమౌళి ప్రమోషన్లు అంటే కేవలం పోస్టర్లు, టీజర్లు మాత్రమే కాదు, అదొక బ్రాండింగ్ విప్లవం. మహేష్ బాబుకు ఉన్న గ్లోబల్ క్రేజ్ మరియు తన మేకింగ్ పై ఉన్న నమ్మకం రాజమౌళిని ప్రశాంతంగా ఉంచుతున్నాయి. ఇతర భారీ చిత్రాల హడావిడి తగ్గిన తర్వాత, సరైన సమయంలో ఒకే ఒక గ్లింప్స్‌తో గ్లోబల్ ట్రెండ్స్‌ను సెట్ చేయాలని ఆయన భావిస్తున్నారు. అందుకే ప్రస్తుతం ఆయన పాటిస్తున్న మౌనం సినిమాపై ఉత్కంఠను మరింత పెంచుతోంది. ఒక్కసారి 'వారణాసి' గర్జన మొదలైతే, పాత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోతాయని అభిమానులు ధీమాగా ఉన్నారు. ఆయన వెనకబడలేదు.. తన అస్త్రాన్ని పదును పెట్టుకోవడానికి విరామం తీసుకుంటున్నారు అంతే.



# అంతర్జాతీయ వేదికపై బాహుబలి యానిమేషన్ చిత్రం

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేడుకలలో అన్నెసీ ఒకటి. యానిమేషన్ రంగంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ప్రాజెక్టులను మాత్రమే ఇక్కడ ప్రదర్శిస్తారు. అటువంటి వేదికపై ఒక భారతీయ యానిమేషన్ చిత్రం చోటు దక్కించుకోవడం దేశీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. చిత్ర బృందం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం, చిత్రంపై అంచనాలను మరింత పెంచింది.

భారతీయ యానిమేషన్‌కు కొత్త ఊపిరి ఇప్పటివరకు హాలీవుడ్ చిత్రాలకే పరిమితమైన అంతర్జాతీయ యానిమేషన్ గుర్తింపు, ఇప్పుడు 'బాహుబలి' ద్వారా భారత్‌కు లభిస్తోంది. ఈ చిత్రం గనుక విజయం సాధిస్తే, దేశంలో మరిన్ని భారీ బడ్జెట్ యానిమేషన్ చిత్రాలు రూపొందడానికి మార్గం సుగమం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. బాహుబలి ఫ్రాంచైజీకి ఉన్న గ్లోబల్ క్రేజ్ ఈ చిత్రానికి మరో పెద్ద ప్లస్ పాయింట్ కానుంది.

# సర్.. మరో అవకాశం ఇవ్వండి



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. తాజాగా రామ్చరణ్ ఎస్క్వైర్ ఇండియా (వంనబఱతీవ ఱఅఎఱఖ)కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

సర్.. మరో అవకాశం ఇవ్వండి అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో పెద్ద తర్వాత వీరిద్దరి కాంబినేషన్లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# అఖిల్ 'లెనిన్' నుంచి క్రేజీ అప్‌డేట్




స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మొదటి సాంగ్‌కు వచ్చిన స్పందన నేపథ్యంలో, ఈ 'ఎట్టా ఎట్టా' వీడియో సాంగ్ కూడా చార్ట్‌బస్టర్‌గా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ వెండితెరపై ఎలా ఉండబోతుందోనన్న ఆసక్తి పెరిగింది.

అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని, 'లెనిన్' చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. అఖిల్ ఈ సినిమాతో భారీ విజయాన్ని అందుకోవాలని పట్టుదలగా ఉన్నారు.



# రాశీ ఖన్నా ర్యాప్ కల్చర్ సిరీస్



ఇటీవలే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో థియటర్లలో సందడి చేసింది కథానాయిక రాశీఖన్నా. తదుపరి ప్రాజెక్టులో భాగంగా ఆమె.. ఓటీటీ వేదికగా వీక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. లుజ్కే అనే టైటిల్తో రూపొందుతున్న వెబ్ సిరీస్ తో అమెజాన్ ప్రైమ్ వేదికగా ఆమె ప్రేక్షకుల్ని పలకరించనుంది. ఈ మధ్య విడుదలైన ఫస్టుక్ వీడియోలో రాశీ.. ఇది ప్రజాస్వామ్యం నాన్న.. ర్యాప్ చేయాలనుకునే వారు చేస్తారు.. వినాలనుకునే వారు వింటారంటూ యాక్షన్ సన్నివేశాలతో ఆశ్చర్య పరిచింది.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007